## నేను పక్కా లోకల్ మనిషిని..ఇక్కడే పుట్టాను..ఇక్కడే పెరిగాను


వరంగల్,తాను పుట్టింది వరంగల్‌లోనేనని ప్రజాశాంతి పార్టీ తెలంగాణ అధ్యక్షుడు బాబు మోహన్ వెల్లడించారు. ఈ నగరంతో తనకు మంచి అనుబంధం ఉందన్నారు. హనుమకొండలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ నగరానికి ఎప్పుడు వచ్చినా తన అడ్డా మాత్రం కరుణపురంలోనే అని ఆయన గుర్తు చేసుకున్నారు. ప్రజాశాంతి పార్టీ నుంచే తాను ఎంపీగా పోటీ చేస్తానని బాబూ మోహన్ స్పష్టం చేశారు. తాను వేరే పార్టీ నుంచి పోటీ చేస్తానని కొందరు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. చీప్ రాజకీయాలు చేయవద్దంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ ప్రజలు తనను గెలిపించాలని... అందరూ శెభాష్ అనేలా ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. సమాజానికి మంచి చేయాలనే ఉద్దేశంతోనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నానన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌లాగా తమ పార్టీ అధినేత కేఏ పాల్ అబద్దాలు చెప్పరనన్నారు. టికెట్ ఇస్తామని చెప్పి బీజేపీ నేతలు మోసం చేశారని.. ఆ పార్టీ నేతల వ్యవహారశైలిపై మండిపడ్డారు. తాను గెలిచిన తర్వాత పేదలందరికీ పింఛన్లు ఇప్పిస్తానని.. అలాగే ఉచిత విద్య, వైద్య సదుపాయాలు కల్పిస్తానని బాబూ మోహన్ ప్రకటించారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :42 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 03-04-2024 | పేజీలు:4 వెల: 2.00


# కాంగ్రెస్ సర్కార్ అలసత్వంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు




సిద్దిపేట: కేసీఆర్ పొలంబాట పట్టిన తర్వాతే ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు ప్రారంభించిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నిన్న గాయత్రి పంప్ హౌస్ నుంచి వరద కాలువకు నీళ్లు విడుదల చేశారని, కేసీఆర్ వెళ్లడంతో సాగర్ ఎడమ కాలువకు నీళ్లు వదిలారని చెప్పారు. ఇప్పుడు కరీంనగర్ వస్తున్నారని ఎస్సారెస్పీ కాలువకు నీళ్లిచ్చారని తెలిపారు. రైతులను ఆదుకోవాలని, ధాన్యానికి రూ.500 బోనస్, రైతు భరోసా, రైతు రుణమాఫీ హామీలు అమలు చేయాలని కోరుతూ సిద్దిపేట కలెక్టర్‌కు హరీశ్ రావు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. నీరు, విద్యుత్ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ అసమర్థత వల్ల లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని చెప్పారు. సర్కార్ అలసత్వం వల్ల రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లుగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. నీళ్లున్నా రైతులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడతామని చెప్పారు.మల్లన్నసాగర్‌లో నీళ్లున్నా.. ఎందుకు విడుదల చేయడంలేదని ప్రశ్నించారు. కూడవెల్లి వాగుకు 24 గంటల్లోగా నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వేలాది మంది రైతులతో మల్లన్న సాగర్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అవసరమైతే తామే మల్లన్నసాగర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తామని చెప్పారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించాలన్నారు. కూడవెల్లి వాగు పరిధిలో 10 వేల ఎకరాలు ఎండిపోయాయని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదని విమర్శించారు. దీనిపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నాని, కాంగ్రెస్ పార్టీ తరుపున చర్చకు ఎవరొస్తారో రావాలన్నారు. రైతులకు నాణ్యమైన 24 గంటల విద్యుత్ ఇచ్చి, పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 25 వేలు ఇచ్చి భట్టి విక్రమార్క తన చిత్తశుద్ధిని చూపించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వానికి బీఆర్ఎస్ పార్టీ డిమాండ్లు

- తక్షణం కాలువలు, చెరువుల కింద ఉన్న పంలకు నీటిని విడుదల చేయాలి. ఇంకా 2-3 తడులకు నీళ్లు అందిస్తే రైతులకు ఉపయోగం.
- వ్యవసాయానికి నాణ్యమైన కరెంటు ఇవ్వాలి. త్రీ ఫేజ్ ఉండేలా చూడాలి.
- ఎండిన పంటలకు సంబంధించి ఎన్యుమరేషన్ చేయించి రైతులకు ఎకరానికి రూ.25వేల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలి.
- రాష్ట్రంలో ఈ యాసంగికి నీటి సమస్యతో దిగుబడి తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి.
- ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ ప్రతి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలి.
- కొనుగోలు కేంద్రాలను విరివిగా ఏర్పాటు చేసి రైతులు తీసుకువచ్చే ప్రతీ గింజను కొనుగోలు చేయాలి.
- ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ తక్షణం చేయాలి.
- రైతులందరికీ రైతుబంధు ఇవ్వాలి.
- రైతుభరోసా కింద ఎకరానికి రూ.15వేలు ఇవ్వాలి.
- వడగల్ల వర్షం ద్వారా పంటలు దెబ్బతిన్న రైతులకు వెంటనే నష్ట పరిహారం అందించాలి, వారిని ఆదుకోవాలి.

# ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం..మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై సీరియస్

హైదరాబాద్,ఏప్రిల్2: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతోనే తమ ఫోన్‌లను ట్యాపింగ్ చేశారంటూ ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో సంచలనం రేపుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ వార్తలపై కేటీఆర్ స్పందిస్తూ కాంగ్రెస్ నేతలు, మంత్రిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అవసరమైతే కోర్టుకు వెళ్తానంటూ హెచ్చరించారు. నాపై ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు చేసిన ఇద్దరు కాంగ్రెస్ నేతలు, మంత్రి కొండా సురేఖ పై కోర్టుకు వెళ్తానని అన్నారు. న్యాయపరంగా నాపై చేస్తున్న అబద్ధపు ఆరోపణలు ఎదుర్కొంటానని తెలిపారు. నిరాధారమైన, మతిలేని ఆరోపణలు చేసిన ఇద్దరు కాంగ్రెస్ నేతలు మంత్రి కొండా సురేఖ, కేకే మహేందర్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లీగల్ నోటీసులు.. పరువు నష్టం దావాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. వాస్తవాలను సరి చూసుకోకుండా... ఇలాంటి వార్తలను ప్రచురించే మీడియా సంస్థలకు కూడా లీగల్ నోటీసులు పంపిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసు ఎంతటి దుమారాన్ని రేపుతుందో అందరికీ తెలిసిందే. ఈ కేసులో తవ్వే కొద్దే అనేక సంచనల విషయాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఇప్పటికే ఈ కేసులో ఎస్ఐబీ డీఎస్పీ ప్రణీత్‌రావు, మరో ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులు భుజంగరావు, తిరుపతన్నను అరెస్ట్ అయ్యారు. అలాగే ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఏ1 నిందితుడిగా ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభాకర్‌పై కేసు నమోదైన వెంటనే ఆయన అమెరికా వెళ్లిపోయారు. ప్రభాకర్ ఆదేశాల మేరకే హార్డ్ డిస్కులను ప్రణీత్‌రావు ధ్వంసం చేసినట్లు విచారణలో నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం వాటిని రికవరీ చేసిన పోలీసులు.. డిస్కుల నుంచి సమాచారాన్ని రిట్రీవ్ చేసే పనిలో పడ్డారు.



మరోవైపు ప్రణీత్ రావుతో పాటు మాజీ అధికారి రాధాకిషన్ రావును కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన రిమాండ్ రిపోర్టులో పోలీసులు సంచలన విషయాలు బయటపెట్టారు. బీఆర్ఎస్ కోసం పోలీసులు డబ్బును తరలించడం.. ప్రత్యర్థి పార్టీలకు సంబంధించిన నగదును సీజ్ చేయడం వరకు ప్రభాకర్‌రావు 'స్పెషల్ ఆపరేషన్ టీమ్' విధులను రాధాకిషన్ వివరించినట్లు రిమాండ్ రిపోర్టు స్పష్టం చేస్తోంది. పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావును ఇంటెలిజెన్స్ చీఫ్(ఓఎస్డీ)గా నియమించడం గత ప్రభుత్వ పెద్దల వ్యూహాత్మక చర్య అని రాధాకిషన్‌రావు పేర్కొన్నట్లు దర్యాప్తు అధికారులు రిమాండ్ రిపోర్టులో పోలీసులు వెల్లడించారు. ఈ క్రమంలో కేటీఆర్ ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటూ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో తీవ్ర కలవరాన్ని రేపుతున్నాయి. అవి నిరాధారమైన ఆరోణలని కేటీఆర్ చెప్పినప్పటికీ ఈ వ్యవహారనికి సంబంధించి పార్టీ అధినేత కేసీఆర్ నుంచి ఎలా స్పందిస్తారన్నది చూడాలి.

# కేజ్రీవాల్ అభ్యర్ధనలకు కోర్టు ఆమోదం..



న్యూఢిల్లీ,ఢిల్లీ మద్యం కేసు లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసిన ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కు స్థానిక రౌస్ అవెన్యూ కోర్టు ఈనెల 15 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించించిన విషయం తెలిసిందే. దీంతో ఆయన్ని తీహార్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో జైల్లో చదువుకోవడానికి పుస్తకాలు, ఇంటి భోజనం, మందులు అనుమతించాలంటూ కేజ్రీ చేసిన అభ్యర్థనలకు కోర్టు ఆమోదం తెలిపింది.కేజ్రీ అభ్యర్థన మేరకు భగవద్గీత, రామాయణం, హౌ ప్రైమ్ మినిస్టర్స్ డిసైడ్ పుస్తకాలను అనుమతించాలని అధికారులను కోర్టు ఆదేశించింది. వీటితోపాటు తన ఆరోగ్యం దృష్ట్యా ఇంట్లో వండిన భోజనం, వాటర్ బాటిల్స్, మందులను అనుమతించింది. జైల్లో ఉన్న సమయంలో సడెన్‌గా బ్లడ్ షుగర్ లెవల్స్ పడిపోతే వాడేందుకు షుగర్ చాక్లెట్స్ ఇంటి నుంచే పరుపులు, దిండ్లు, వైద్యులు సూచించిన విధంగా ఒక టేబుల్, కుర్చీ వంటి వస్తువులను కూడా అనుమతించింది.వీటితోపాటు మతపరమైన లాకెట్ ధరించేందుకు కేజ్రీ పెట్టిన అభ్యర్థనకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జైలు నిబంధనల ప్రకారం వస్తువులన్నింటినీ జైలు అధికారులు తరచూ పరిశీలిస్తుంటారని కోర్టు తెలిపింది. జైల్లో ఉన్న సమయంలో కేజ్రీ తన భార్య సునీతను కూడా కలుసుకోవచ్చని కోర్టు తెలిపింది. మరోవైపు అరవింద్ కేజ్రీవాల్ బీపీ, షుగర్ లెవల్స్‌ను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని జైలు అధికారులను కోర్టు ఆదేశించింది.

జైల్లో కేజ్రీ దినచర్య

కాగా కేజ్రీవాల్‌ను తీహార్ జైలులోని నంబర్ 2 జైలులో ఉంచారు. ఇక్కడ 24 గంటలపాటు సీసీటీవీ నిఘా ఉంటుంది. 24/7 వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఆయన షుగర్ వ్యాధితో బాధపడుతున్నందున రెగ్యులర్ చెకప్‌లు చేయనున్నారు. ఇక జైల్లో మిగిలిన ఖైదీల మాదిరిగానే కేజ్రీవాల్ దినచర్య ఉదయం 6.30 గంటలకే రోజు ప్రారంభం కానుంది. అల్పాహారంలో భాగంగా ఆయనకు టీ, కొన్ని రొట్టెముక్కలు (బ్రెడ్ స్లైసెస్) ఇవ్వనున్నారు. అనంతరం కోర్టు విచారణ ఉంటే ఆయన్ని తీసుకెళ్తారు. లేదంటే కేజ్రీవాల్ తన న్యాయబృందంతో సమావేశమయ్యేందుకు అనుమతి ఉంది. ఉదయం 10.30 నుంచి 11 గంటల మధ్య భోజనం ఇవ్వనున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 వరకూ సీఎం తన జైలు గదిలోనే ఉండాల్సి ఉంటుంది. ఆ సమయంలో లాకప్‌కు తాళం వేస్తారు. ఖైదీలందరినీ లాకప్‌లోనే ఉంచుతారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఒక కప్పు టీ, రెండు బిస్కట్లు ఇస్తారు. సాయంత్రం 4 గంటలకు మళ్లీ తన లాయర్లతో సమావేశం అవ్వొచ్చు. సాయంత్రం 5.30 గంటలకే రాత్రి భోజనం అందిస్తారు. అనంతరం 7 గంటలకల్లా మళ్లీ సెల్‌లోకి పంపిస్తారు. జైల్లో కేజ్రీవాల్‌కు టీవీ చూసే సదుపాయం కూడా ఉంది.

ఆప్ నేతలంతా తీహార్ జైల్లోనే..

మరోవైపు మద్యం కుంభకోణం కేసులో జైలుకు వెళ్లిన ఆప్ నేతల్లో కేజ్రీవాల్ నాలుగో వ్యక్తి కావడం గమనార్హం. అంతకుముందు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా. మాజీ మంత్రి సత్యేంద్ర జైన్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థలు పలు కేసుల్లో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వాళ్లు కూడా ప్రస్తుతం తీహార్ జైలులోనే ఉన్న విషయం తెలిసిందే.

ఆయనే సీఎంగా కొనసాగుతారు: ఆప్

కేజ్రీవాల్‌ను ఎంతకాలం జైల్లో ఉంచినప్పటికీ, ఢిల్లీ సీఎంగా ఆయనే కొనసాగుతారని ఆప్ నేత జాస్మిన్ షా పేర్కొన్నారు. సీఎంగా ఢిల్లీ ప్రజలకు సేవ చేసేందుకు ఆయన రాజ్యాంగబద్ధంగా ప్రమాణస్వీకారం చేశారని, అది ఆయన బాధ్యత అని అన్నారు. జాస్మిన్ షా సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ మద్యం పాలసీ కేసులో ఆతిశీ,భరద్వాజ్ పేర్లను తీసుకురావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆప్‌ను ఖతం చేయాలంటే కేజ్రీవాల్‌ను మాత్రమే జైలుకు పంపిస్తే సరిపోదని బీజేపీ భావిస్తున్నదని ఆరోపించారు.మరోవైపు రానున్న రోజుల్లో పార్టీలో కేజ్రీవాల్ భార్య సునీత కీలక పాత్ర పోషించనున్నారని ఆప్ వర్గాలు పేర్కొన్నాయి.

# అవి బయటపెడితే తట్టుకోలేరు...కడియం వార్నింగ్

హైదరాబాద్,బీఆర్ఎస్ నేతలందరి చిట్టాలు తన వద్ద ఉన్నాయని అవి బయటపెడితే తట్టుకోలేరని ఎమ్మెల్యే కడియం శ్రీహరి వార్నింగ్ ఇచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్‌ను వీడటం కొంత బాధగానే ఉందని, కేసీఆర్‌పై నాకు గౌరవం ఉందని, ప్రత్యేకంగా కేసీఆర్‌పై నేను ఎలాంటి విమర్శలు చేయదలుచుకోలేదన్నారు.పల్లా రాజేశ్వర్‌రెడ్డి కారణంగానే పార్టీ భ్రష్టు పట్టిపోయిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కేసీఆర్ చెవిలో దూరి తప్పుడు సమాచారం ఇస్తూ, ఇతరులపై లేనిపోని చాడీలు చెప్పి నేతలను కేసీఆర్ కు దూరం చేశారని కడియం శ్రీహరి అన్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి వల్లనే పార్టీ ఓడిపోయిందని కూడా అన్నారు. ఇదే అభిప్రాయం తనలో మాత్రమే కాదని అనేక మంది నేతల్లో ఉందని, కావాలంటే ఎవరైనా ఆయన వ్యవహారశైలిపై అంతర్గతంగా నేతలను విచారించవచ్చని అన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసమే పార్టీ మారానని అన్నారు.

ఎర్రబెల్లి నోరు అదుపులో పెట్టుకో..

మనవరాలి వయసున్న అమ్మాయి చేతిలో ఓటమి పాలయిన ఎర్రబెల్లి దయాకర్ రావు తనను విమర్శించే స్థాయిలేదన్నారు. తన నిజాయితీ అందరికీ తెలుసునని అన్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలన్నారు. ఎందరో పార్టీలు మారినా తననే ఎందుకు టార్గెట్ చేస్తున్నారని కడియం శ్రీహరి ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతల అందరి చరిత్ర తన వద్ద ఉందని, తనకు ఒక్క రూపాయి బీఆర్ఎస్ ఇచ్చినట్లు రుజువు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు.



బీజేపీని అడ్డుకునే శక్తి కాంగ్రెస్‌కే ఉంది

బీజేపీని అడ్డుకునే శక్తి కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు కడియం శ్రీహరి. బీజేపీ.. సీబీఐ, ఈడీలను ప్రయోగించి నేతలను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. బీజేపీలో చేరితే పునీతులవుతారని, కాంగ్రెస్‌లో చేరితే విమర్శలు చేస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ నాలుగు వందల సీట్లలో గెలిస్తే వారు రాజ్యాంగాన్నే మార్చేస్తారని, రిజర్వేషన్లను ఎత్తేసే ప్రమాదం ఉందని కడియం పేర్కొన్నారు. ఇలాంటి నేపథ్యంలో బీజేపీ అప్రజాస్వామిక పద్ధతులను అడ్డుకోవాల్సి అవసరముందని బీజేపీని అడ్డుకునే శక్తి కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. ఎన్నికల్లో నన్ను గెలిపించిన విధంగానే, కావ్యను కూడా గెలిపించాలని కోరారు.

## ఏపిలో స్కూళ్లకు 24 నుంచి వేసవి సెలవులు

అమరావతి: ఏపీలో ఎండలు మండుతున్నాయి. దీంతో ఏపీ ప్రభుత్వం స్కూళ్లకు వేసవి సెలవులు ప్రకటించేసింది. ఏప్రిల్ 24 నుంచి పాఠశాలలకు సెలవులు ప్రారంభం కానున్నాయి. జూన్ 13 వరకూ అంటే 50 రోజుల పాటు పాఠశాలలకు ప్రభుత్వం సెలవులను ప్రకటించింది. మార్చి 18 నుంచి ఏపీ ప్రభుత్వం ఎండల కారణంగా ఒంటిపూట బడులను ప్రకటించింది. అప్పటి నుంచి ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఒంటిపూట ఒడులు నిర్వహిస్తున్నారు.

# కేసీఆర్ పాలనలో ఒక్క ఎకరం ఎండలే...



మంథని, ఏప్రిల్ 2 : తొమ్మిన్నరేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో ఎక్కడా ఒక్క ఎకరం ఎండలేదని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మవాడ సమీపంలో ఎండిన పంటపొలాలను జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్‌తో కలిసి ఆయన పరిశీలించారు.ఎండిన పంటలను చూపిస్తూ కన్నీరు పెట్టుకున్న రైతులను వారు ఓదార్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అదికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో పాలకులు నీళ్లిస్తామని భరోసా ఇవ్వడం మూలంగానే రైతులు పంటలు సాగుచేసుకున్నారని, పంటలు సాగుచేసుకున్న తర్వాత నీళ్లివ్వక పోవడంతో నష్టపోయారని ఆయన అన్నారు. తమ ప్రభుత్వం అదికారంలో ఉన్నప్పుడు వర్షాబావంఏర్పడి నీళ్ల పరిస్థితుల్లో నీళ్లు ఇవ్వలేమని ముందుగానే రైతులకు చెప్పామని, దాంతో రైతులు కూడా పంట సాగుకు ముందుకు రాలేదన్నారు. రైతుల పట్ల ముందుచూపు లేని కాంగ్రెస్ ప్రభుత్వం మూడు మాసాల్లో రైతులకు కన్నీరు మిగిల్చిందని ఆయన అన్నారు.సాగునీరు అందక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతే పరామర్శించి ఆదుకుంటామని భరోసా ఇవ్వాల్సింది పోయి గత ప్రభుత్వం, పాలకులపై నిందలు వేయడం, విమర్శలు చేయడం విడ్డూరంగాఉందన్నారు. అకాల వర్షాలతో పంట నష్టం జరిగితే ఆనాడు తమ ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకుందనే విషయాన్ని కాంగ్రెస్ పాలకులు గుర్తించాలన్నారు. ఎండిన పంట ఎకరాకు రూ.25వేల చొప్పున అందించి ఆదుకోవాలని, అలాగే పంట మద్దతు ధర రూ.500 బోనస్‌పై వెంటనే ప్రకటన చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ప్రతిపక్ష పాత్ర పోషిస్తే రాజకీయాలు చేయడమా...పుట్ట మధూకర్, జెడ్పీ చైర్మన్

ప్రతిపక్షంలో ఉండి ప్రతిపక్ష పాత్ర పోషిస్తే రాజకీయాలు చేస్తున్నారని మాట్లాడటం విడ్డూరంగా ఉందని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. మంథని పట్టణంలోని పోచమ్మవాడ సమీపంలో బిరుదు మల్లయ్య,శ్రీనివాస్‌ల ఎండిపోయిన పంట పొలాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లయ్య, శ్రీనివాస్‌లు 14ఎకరాల్లో పంట సాగు చేశారని, నెల రోజులుగా నీళ్లు రాకపోవడంతో పంట పూర్తిగా చేతికి రాకుండా పోయిందని, అప్పులు, ఆస్తులు అమ్ముకుని పంటలు వేసుకుంటే కాంగ్రెస్ పాలకుల అసమర్థతతో ఆగమై పోయారని ఆయన వాపోయారు. ఎండిన పంటలకు నష్టపరిహారంతో పాటు మిగిలిన పంటలను కాపాడాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నేతృత్వంలో రైతులతో కలిసి 36గంటల నిరసన దీక్ష చేపట్టితే జిల్లాలో ఎండిన పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించాల్సిన పాలకులు జిల్లా కేంద్రంలో కూర్చుండి అధికారంలో లేని వాళ్లపై అబండాలు వేస్తున్నారని అన్నారు.

# బహుజనుల పోరాటయోధుడు పాపన్న గౌడ్..

గద్వాల, ఏప్రిల్ 2 : బహుజన రాజ్యాధికార పోరాటయోధుడు మొగలాయి అరచకాల్ని ఎదిరించి, తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 314వ వర్ధంతి సందర్భంగా గౌడ కుల సంఘ నాయకులు ఏర్పాటు చేసిన వేడుకలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరిత తిరుపతయ్య పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం జెడ్పి చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య మాట్లాడుతూ..సబ్బండ వర్గాలను ఏకం చేసి రాజ్యాధికారాన్ని స్థాపించిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను నెరవేర్చడానికి ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలని వర్ధంతి సందర్భంగా సరిత తిరుపతయ్య పిలుపునిచ్చారు. రాచరిక వ్యవస్థ నీడలో జమిందారీ, జాగీర్దార్లు సాగిస్తున్న అరాచకాలను చూసి కోపోద్రేకుడైన బహుజన కులాలను ఏకం చేసి పోరాటం సాగించారన్నారు. గద్వాల జిల్లా కేంద్రంలో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేసేందుకుగాను కృషి చేస్తానని, స్థల సేకరణ చేసి త్వరలోనే అందుబా టులోకి తీసుకుని వస్తామని గౌడ కుల సంఘం నాయకులకు సరిత తిరుపతయ్య హామీ ఇచ్చారు.



ఈకార్యక్రమ ంలో కాంగ్రెస్ నాయకులు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

బుధవారం 03-04-2024

# న్యాయం ముసుగులో అన్యాయ లేఖ

ఒక వ్యవస్థను రక్షించే పేరిట దానిపైనే దాడి చేయడం ఒక విచిత్రమైన ఎత్తుగడ, విడ్డూరమైన ప్రయత్నం. న్యాయాన్ని ధర్మాన్ని రాజ్యాంగాన్ని కాపాడాల్సిన సుప్రీంకోర్టు చుట్టూనే ఈ తతంగమంతా జరగడం, దానిపై సాక్షాత్తూ దేశ ప్రధాని, విశ్వగురు నరేంద్ర మోడీ క్షణాల మీద జోక్యం చేసుకోవడం మామూలు సంగతా? గురువారం నాడు 600 మంది ప్రముఖ న్యాయవాదులు భారత ప్రధాన న్యాయమూర్తి సిజెఐ డి.వై. చంద్రచూడ్‌కు రాసిన లేఖ అలాంటి ఉదాహరణే. ఈ మధ్య తెలుగువారు ఎక్కువగా విన్న పేరు హరీశ్ సాల్వే, అదీశ్ సి. అగర్వాలా, చేతన్ మిట్టల్, పింకీ ఆనంద్, హితేష్ జైన్, స్వరుపమ చతుర్వేది తదితరులు ఈ లేఖపై సంతకాలు చేశారు. న్యాయవ్యవస్థకు ప్రమాదం– రాజకీయ, వృత్తిపరమైన ఒత్తిళ్ల నుంచి న్యాయవ్యవస్థ రక్షణ అని ఆ లేఖకు పేరు పెట్టారు.ఒక స్వార్థపర బృందం న్యాయవ్యవస్థపై ఒత్తిడి తేవడానికి, కోర్టులను అపఖ్యాతిపాలు చేయడానికి ప్రయత్నిస్తుందని లేఖలో ఆరోపించారు. అర్థరహితమైన తర్కాలు, కాలం చెల్లిన రాజకీయ ఎజెండాలతో వారు కోర్టులను ఒత్తిడి చేస్తున్నారని లేఖ విమర్శించింది. ”రాజకీయ కేసుల్లో వారి ఒత్తిడి, ఎత్తుగడలు అత్యంత స్పష్టంగా కనిపిస్తాయి. మరీ ముఖ్యంగా కీలకమైన నాయకులకు సంబంధించిన అవినీతి కేసులలో ఇది జరుగుతుంది. ఈ ఎత్తుగడలు మన కోర్టులను దెబ్బ తీస్తున్నాయి. ప్రజాస్వామ్య చట్రానికి ముప్పు తెస్తున్నాయి. న్యాయవ్యవస్థ పని చేయడానికి కీలకమైన విశ్వాసం సుహృద్భావంతో కూడిన వాతావరణం వారి కుప్పిగంతుల వల్ల కలుషితమైపోతున్నది. ఈ ఉద్దేశపూర్వకమైన ఈ వర్గాలు వివిధ రూపాల్లో పనిచేస్తాయి. లేనిపోని కథనాలు సృష్టిస్తాయి. కోర్టులు గతంలో చాలా మెరుగ్గా వుండేవంటూ ఇప్పటి పరిస్థితిని పోల్చి చూపిస్తుంటాయి. ఇవి కావాలని చేసే ప్రకటనలు మాత్రమే. కొన్ని రాజకీయ ప్రయోజనాల కోసమే ఇవన్నీ ముందుకు తెస్తాయి. కోర్టుల నిర్ణయాలను ప్రభావితం చేయడానికి, కోర్టులను ఇబ్బందిలో పెట్టడానికి ప్రయత్నిస్తాయి. కొంతమంది న్యాయవాదులు ఉదయంపూట ఒక రాజకీయ నేతను సమర్థిస్తూ వాదించి రాత్రి పూట మీడియా ద్వారా ఆ న్యాయమూర్తిని ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తారు. గతంలో కోర్టులు ఇలాంటి ప్రభావాలకు సులభంగా లోబడేవన్న అభిప్రాయం ఏర్పరచడం ప్రజల విశ్వాసానికి భంగం కలిగిస్తుంది%౫%”. ఇలా ఆ లేఖలో అనేక ఆరోపణలు గుప్పించారు.

ఇవన్నీ నిజం కాదా?

ఇంతటితో ఆగకుండా 'బెంచి ఫిక్సింగ్' (అనుకున్న ధర్మాసనానికి వచ్చేలా చేయడం) అనే సిద్ధాంతాన్ని కూడా ముందుకు తెస్తున్నారని ఆ లేఖ తిట్టిపోసింది. ఇది అగౌరవపరిచేదే గాక కోర్టు ధిక్కారం కూడా. కొన్ని సార్లు ఇది దుష్ప్రచారాలకు, సంబంధిత జడ్జిలపై పరోక్ష ఆరోపణలకు కూడా దారితీస్తుంటుంది. వారు మరీ దిగజారి మన కోర్టులను చట్టబద్ధ పాలన లేని దేశాలతో పోల్చడానికి కూడా తెగబడుతున్నారు. ఇవి కేవలం విమర్శలే కాదు, కోర్టులపై ప్రత్యక్ష దాడులే అంటూ ఆ లేఖ రాసిన వారు తీవ్రంగా వ్యాఖ్యానించారు. మా మాటే చెల్లాలి. లేదంటే రోడ్డుకెక్కుతాం అనే ఈ పద్ధతి అనర్థదాయకమని హెచ్చరించారు. రాజకీయవేత్తలు తాము అవినీతిపరులని ఆరోపించినవారి తరపునే కోర్టులో వాదించడం మరో విపరీతం. కోర్టుల్లోనూ బయటా కూడా తప్పు సమాచారం వ్యాప్తి చేస్తారు. లోపాయికారీ ఎత్తుగడలకు పాల్పడతారు. అది కూడా కీలకమైన ఎన్నికల సమయంలో ఇలాంటి పనులు చేయడం మరింత సందేహాస్పదమైంది. 2018–19 ఎన్నికల సమయంలోనే ఈ విధమైన ఎత్తుగడలకు పాల్పడ్డం చూశామంటూ ఇప్పుడు జరుగుతున్నదీ అదేననే భావన కలిగించేందుకు ఆ లేఖ ప్రయత్నించింది. ఇలాంటి వారిని మౌనంగా సహించే సమయం కాదనీ, ప్రధాన న్యాయమూర్తి నాయకత్వంలో సరైన నిర్దేశం కోసం, నిర్ణయాత్మక నాయకత్వం కోసం తాము ఎదురు చూస్తున్నామనీ ఆ లేఖ ముగింపులో రాశారు.

మోడీ అర్జెంటు మద్దతు రహస్యం?

ఆ లేఖపై ఇంకా ఎవరూ పెద్దగా స్పందించక ముందే స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ రంగంలోకి దిగారు. అన్ని వ్యవస్థలనూ దెబ్బకొట్టి లంగదీసుకోవడం కాంగ్రెస్‌కు అలవాటని మోడీ 'ఎక్స్' (ట్విటర్)లో రాశారు. అంటే ఒక విధంగా న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా పని చేస్తున్న వర్గం ప్రతిపక్షం అండతో పనిచేస్తుందని ఆరోపించారన్న మాట. లోబడి వుండే న్యాయవ్యవస్థను కాంగ్రెస్ కోరుకుంటుంది అంటూ ఎమర్జన్సీ నాటి నినాదాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. అందుకే 140 కోట్ల భారతీయులు వారిని తిరస్కరిస్తున్నారని ఎన్నికల భాషలో మాట్లాడారు. దీనిపై కాంగ్రెస్ కూడా వెంటనే స్పందించింది. ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఎక్స్'లో రాస్తూ ప్రజాస్వామ్యాన్ని తారుమారు చేయడంలోనూ రాజ్యాంగాన్ని దెబ్బ తీయడంలోనూ మోడీ ప్రత్యేక ప్రజ్ఞ సాధించారని ఎగతాళి చేశారు. న్యాయవ్యవస్థకు ముప్పు తెచ్చే అనేక చర్యలు మోడీనే తీసుకున్నారని ఉదాహరణలతో సహా ప్రస్తావించారు. 2018లో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నలుగురు సీనియర్ న్యాయమూర్తులు న్యాయవ్యవస్థ పరిణామాలపై ఆందోళన వెలిబుచ్చడం, ప్రజాస్వామ్యం నాశనమవుతుందని హెచ్చరించడం గుర్తు చేశారు. వారిలో ఒకరిని (రంజన్ గొగోరు) రాజ్యసభకు పంపడం న్యాయవ్యవస్థను లోబడి వుండేలా చేసుకోవడం కోసం కాదా అని ఖర్గే ప్రశ్నించారు. ఒక హైకోర్టు న్యాయమూర్తిని (బెంగాల్‌లో) మీ పార్టీ అభ్యర్థిగా నిలబెట్టడం దేనికి సూచన అని నిలదీశారు. న్యాయాధికారుల నియామక కమిషన్ బిల్లును లోపభూయిష్టంగా తీసుకొచ్చి సుప్రీంకోర్టు కొట్టివేసే పరిస్థితి తెచ్చింది మీరే కదా అనీ ఆక్షేపించారు. నిజానికి ఈ లేఖలో రహస్యమే అది.

మింగుడు పడని తీర్పులు, నిరసనలు

పైకి చూస్తే న్యాయవ్యవస్థను సమర్థిస్తున్నట్టు, సంరక్షించడానికే ఉద్దేశించినట్టు రాసిన ఈ లేఖ వాస్తవానికి సిజెఐతో సహా మొత్తం వ్యవస్థను బెదిరించడానికే రాసింది. ఎన్నికల బాండ్లతో సహా కొన్ని కేసుల్లో వచ్చిన సంచలన తీర్పులు ఈ వర్గానికి కంటగింపుగా మారాయి. సాక్షాత్తూ హోంమంత్రి అమిత్ షా తీర్పును గౌరవిస్తున్నానంటూనే వాటిని రాజ్యాంగ విరుద్ధమనడాన్ని తప్పు పట్టారు. దీనికి బదులు ఏదో ఒక మధ్యే మార్గం చూపించి వుండాల్సిందన్నారు. ప్రయోగాత్మకంగా చేసినప్పుడు పొరబాట్లు వుండొచ్చని అంతమాత్రాన మొత్తం తప్పంటే సమస్య అని ఆరెస్సెస్ మార్గదర్శక మండలి వ్యాఖ్యానించింది. ఎన్నికల బాండ్ల బండారం ఒకవైపున బహిర్గతమవుతుంటే బిజెపి నేతలు, గురువులు ఇలా మాట్లాడారంటేనే ఈ తీర్పు వారికి ఎంత ఇబ్బందిగా మారిందో తెలుస్తుంది. రాష్ట్రాల హక్కులకే కేరళ, తమిళనాడు వేసిన కేసులలో కూడా సుప్రీం కోర్టు గట్టి తీర్పులే ఇచ్చింది. తమిళనాడు గవర్నర్‌కు ఆదేశాలిచ్చి మరీ ఆయన నిరాకరించిన మంత్రితో ప్రమాణ స్వీకారం చేయించింది. పేద రాష్ట్రమైన కేరళ ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు ఏ పద్ధతిలో సహకరిస్తారని ప్రశ్నించింది. తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసైకి, కేరళ గవర్నర్ ఆరిఫ్

# ఫ్రస్టేషన్ లో కేశినేని నాని.. మూడు నెలలు పెన్షన్లు రావంటూ బెదిరింపులు



అమరావతి,తెలుగుదేశంతో కేశినేని నాని పొలిటికల్ జర్నీ బ్రేక్ అయిన క్షణం నుంచీ ఆయన తన రాజకీయ భవిష్యత్ పై ఆందోళనలో ఉన్నారు. వరుసగా రెండు సార్లు ఎంపీ కావడానికి కారణమైన తెలుగుదేశం పార్టీని అహంభావంతో వీడి.. వైసీపీ గూటికి చేరిన కేశినేని నానికి... ఇప్పుడు భవిష్యత్ గందరగోళంగా కనిపిస్తోంది. పార్టీని వీడి విజయవాడ ఎంపీగా వైసీపీ తరఫున పోటీ చేయడానికి టికెట్ సంపాదించుకున్నా.. గెలిచే అవకాశాలు ఇసుమంతైనా కనిపించకపోవడంతో ఫస్ట్రేషన్ పీక్స్ కు చేరింది. దీంతో ఈసీ ఆదేశాలకు సైతం వక్రభాష్యాలు చెబుతూ జనాలను బెదరించడానికి కూడా వెనుకాడటం లేదు.విజయవాడ లోక్ సభ నియోజకవర్గంలో తెలుగుదేశంను కాదని విజయం సాధించడం సాధ్యం కాదన్న విషయం రోజు రోజుకూ విస్పష్టంగా అర్థమౌతుండటంతో ఆయనలో నిరాశ నిస్పృహలు నెలకొన్నట్లు కనిపిస్తోందని పరిశీలకులు ఆయన మాటలను ఉటంకిస్తూ విశ్లేషణలు చేస్తున్నారు. తాజాగా వాలంటీర్లను పించన్ల పంపిణీకి దూరంగా ఉంచాల్సిందేనంటూ ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలపై నాని చేసిన వ్యాఖ్యలకు ఆయన నమ్ముకుని వచ్చిన వైసీపీ నుంచీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. వచ్చే మూడు నెలల వరకూ వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు రావనీ, వాళ్లు చాలా చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందనీ కేశినేని నాని హెచ్చరిస్తున్నారు.ఒక విధంగా వాలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచాలంటూ ఈసీ ఆదేశాలకు తెలుగుదేశం పార్టీ వాలంటీర్లపై ఎన్నికల సంఘానికి చేసిన ఫిర్యాదులే కారణమని చెబుతున్నారు. పేదులు ఇబ్బందులు పడతారు, మూడు నెలలు పింఛన్లు అందకపోతే మందులు, ఇతర నిత్యావసరాల కొనుగోలుకు వారి వద్ద డబ్బులు ఉండవు అంటూ మీడియా సమావేశంలో కేశినేని చెప్పారు. అయితే పింఛన్ల పంపిణీని నిలిపివేయాలని ఎన్నికల సంఘం ఆదేశించలేదు. ఆ పంపిణీ నుంచి వాలంటీర్లను మాత్రమే దూరం పెట్టింది. అలాగే పింఛన్ల పంపిణీ నుంచి వాలంటీర్లను దూరం చేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వులలో వీటిని ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయాలని విస్పష్టంగా పేర్కొంది. ఓటర్లను ప్రభావితం చేయకుండా ఉండేందుకు వాలంటీర్లను మాత్రమే నిషేధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఆ ఆదేశాలకు కేశినేని నాని వక్రభాష్యం చెబుతున్నారు. కేశినేని నాని చెప్పిన దాని ప్రకారం జగన్ పింఛన్లు నిలిపివేయాలని లేదా పంపిణీలో మరిన్ని ఇబ్బందులు సృష్టించాలని అధికారులను ఆదేశించారా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా జగన్ కు అలా ఆదేశాలిచ్చే అధికారాలు లేవు. అయినా అధికారులలో తనకు తొత్తులుగా ఉన్నవారి ద్వారా ఇటువంటి ఆదేశాలు అమలు అయ్యేలా ఏమైనా కుట్రలకు తెరతీశారా అన్న అనుమానాలూ వ్యక్తమయ్యేలా కేశినేని మాటలు ఉన్నాయి. పింఛన్లు సక్రమంగా అందకుండా అవరోధాలు సృష్టించడం ద్వారా వాలంటీర్ వ్యవస్థ చాలా బాగుందని , కుట్రపూరితంగా ప్రతిపక్షాలు వాలంటీర్లపై ఆరోపణలు, ఫిర్యాదులు గుప్పించి, ఆ వ్యవస్థను స్తంభింప చేసి ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టేశారనీ జనం అనుకునేలా చేయాలన్న లక్ష్యంతో జగన్ కుట్రలు చేస్తున్నారా అన్న అనుమానాలు తావిచ్చేలా కేశినేని నాని మాటలు ఉన్నాయన్న విమర్శలు అన్ని వర్గాల నుంచీ వ్యక్తం అవుతున్నాయి. కేశినేని తన వ్యాఖ్యల ద్వారా.. జగన్ ప్లాన్ బయటపెట్టేసినట్లైందని వైసీపీ వర్గాలు సైతం నానిపై గుర్రుగా ఉన్నారు.మొత్తం మీద వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు అందవంటూ కేశినేని చేసిన వ్యాఖ్యలు ఒక విధంగా జగన్ సర్కార్ ఎత్తుగడను దెబ్బ తీశాయని పరిశీలకులు అంటున్నారు. ఈ విషయమై ఇప్పుడు తెలుగుదేశం సీరియస్ గా సీఎస్ కు, ఎన్నికల సంఘానికి లేఖలు రాయడం ద్వారా విషయాన్ని పబ్లిక్ చేశాయనీ, ఇప్పుడు ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని అర్హులందరికీ పింఛన్లు నేరుగా ఇళ్ల వద్దనే అందించాలంటూ ఆదేశాలు జారీ చేసే అవకాశాలున్నాయనీ అంటున్నారు.

# రేవంత్‌కు నల్లగొండ,ఖమ్మం నేతలతోనే ముప్పు

నల్లగొండ,కాళేశ్వరంపై అవాకులు చవాకులు పేలిన వారే..కెసిఆర్ రైతల బాట పట్టడంతో నీళ్లు విడుదల చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. విమర్శించిన కాళేశ్వరమే నీళ్లు అందిస్తున్నదని అర్థం అయ్యిందన్నారు. ఈ పని ముందే చేసివుంటే రైతుల పంటలు కాపాడుకునే వారిమని అన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే ఏక్‌నాథ్ షిండేలు ఉన్నారని.. నీ పక్కనే ఉన్న ఖమ్మం, నల్లగొండ బాంబులతోనే నీకు ప్రమాదం పొంచి ఉందని రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీతో రేవంత్‌కు ఎలాంటి ఇబ్బంది లేదని, ఈ ఐదేండ్లు ఆయనే పాలించి, హామీలు అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాలో ఏర్పాటు చేసిన నల్లగొండ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నప్పటికీ రుణమాఫీ చేయలేదు. రైతుబంధు ఇవ్వలేదు.. కాంగ్రెస్ ప్రభుత్వం పై గ్రామాల్లో రైతులు కుతకుత ఉడుకుతున్నారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టండి అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అంటడు. చెప్పుతో కొట్టమన్న ఆయన అహంకారానికి ఓటు అనే ఆయుధంతో వేటు వేయండి. రైతుబంధు దుబారా అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటుండు. అహంకారంగా మాట్లాడే ఈ జిల్లా నాయకులకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రూ. 2 లక్షల రుణమాఫీ కావాలంటే, రూ. 15 వేల రైతుబంధు ఇవ్వాలంటే, వరి ధాన్యానికి బోనస్ రూ. 500 ఇవ్వాలంటే బీఆర్ఎస్‌కు ఓటేయాలి. కాంగ్రెస్‌కు ఓటేస్తే.. తాము ఏవీ అమలు చేయకున్నా.. మళ్లీ మాకే ఓటేశారని తప్పించుకు తిరుగుతారు. సీఎం రేవంత్ జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నా అంటుండు. తనకు తెలిసి జేబు దొంగలు తిరుగుతారు ముఖ్యమంత్రులు తిరుగరని కేటీఆర్ తెలిపారు. పేగులు కట్ చేసి మెడలో వేసుకుంటా అంటుండు. అది ముఖ్యమంత్రి చేసే పనా.. అది బోటి కొట్టేడు చేసే పని. సెక్రటేరియట్‌లో లంకె బిందెలు ఉన్నాయకున్నా.. ఇక్కడ ఖాళీ బిందెలు ఉన్నాయి. అయినా లంకె బిందెల కోసం ఎవరు తిరుగుతారు.. అని కేటీఆర్ ప్రశ్నించారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెళ్లి నితిన్ గడ్కరీ వద్ద నేనొస్తా నేనొస్తా అని అంటున్నారట. రుణమాఫీ చేయ్. 18 ఏండ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ. 2500 ఇస్తానని చెప్పావు. రైతుబంధు రూ. 15 వేలు ఇస్తా అన్నావు.. దాని కోసం రైతలు ఎదురు చూస్తున్నారు. ఆటో డ్రైవర్లు రోడ్ల మీద పడి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉంది. ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 10 వేలు ఇచ్చి ఆదుకోవాలి. దమ్మంటే ఈ పనులు చేసి చూపించు అని కేటీఆర్ సవాల్ చేశారు. పొంకనాల పోతిరెడ్డి మాటలు విని ప్రజలు మోసపోయారు. నిజం నిలకడ మీదనే తెలుస్తుంది. ఇదే తెలంగాణ ప్రజలు ప్రేమతో, దయతో పదేండ్లు బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చారు. బీఆర్ఎస్ పాలన స్వర్ణయుగాన్ని తలపించింది. ఇక బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే.. బీజేపీకి బీ టీమ్ బీఆర్ఎస్ అని రాహుల్ గాంధీ నుంచి రేవంత్ దాకా మాట్లాడారు. ఇవాళ రాహుల్ మాట్లాడుతూ.. మోదీ దొంగ అంటడు. రేవంత రెడ్డేమో మోదీ మా పెద్దన్న అని అంటుండు. అదానీ ఫ్రాడ్ అని రాహుల్ అంటుంటే.. అదానీ మా ఫ్రెండ్ అని రేవంత్ అంటుండు. లిక్కర్ స్కాం లేదు.. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అన్యాయం అని రాహుల్ అంటుండు. లిక్కర్ స్కాం నిజమే. కవిత అరెస్టు కరెక్ట్ అని రేవంత్ అంటుండు. గుజరాత్ ఓ ఫేక్ మోడల్ అని రాహుల్ అంటడు.. తెలంగాణను గుజరాత్ మోడల్‌లా చేస్తా అని రేవంత్ అంటున్నాడు. రేవంత్ రాహుల్ కోసమా, మోదీ కోసమా పని చేసేది. ఒక్క ఓటు కాంగ్రెస్‌కు వేసినా అది బీజేపీకి పోతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఇదే రేవంత్.. షెల్టర్, భవిష్యత్, కేసుల నుంచి బయటపడటం కోసం బీజేపీలో చేరుతారు. ఈ మాట పదిసార్లు అన్నాను. కానీ ఈ విషయంలో మాత్రం రేవంత్ స్పందించడం లేదని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ నిన్నటి పర్యటన వీడియోలు చూస్తే నల్గొండ జిల్లాలో ఎలా ఓడిపోయామో తెలియడం లేదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పదేళ్ల నిజం ముందు వంద రోజుల అబద్ధాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మోసపోయినోళ్లు బీఆర్ఎస్ ఓటేయాలని.. రుణమాఫీ వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటేయాలన్నారు. కరెంటు, నీళ్లు ఇవ్వక పోయినా, పంటలు ఎండినా కాంగ్రెస్‌కే ఓటు వేస్తే ఐదేళ్లు తప్పించుకుంటారన్నారు. తప్పు ప్రజలది కాదు. కేసీఆర్ మనల్ని నమ్ముకున్నాడు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి మనం తీసుకెళ్లలేకపోయాం. అందువల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామని కేటీఆర్ తెలిపారు. తుంగతుర్తి, సూర్యాపేటలో కేసీఆర్ పర్యటన సందర్భంగా జనంలో ఆ ఎమోషన్ చూస్తుంటే.. అసలు నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ



ఎందుకు ఓడిపోయిందనేది అర్థం కాలేదు. ఓటమి గల కారణాలపై ఈ వంద పది రోజుల్లో వేల మందితో కూర్చొని మాట్లాడుకున్నాం. ఏం జరిగిందని విశ్లేషించుకున్నాం. నల్లగొండ, మిర్యాలగూడ, కోదాడ సభలకు హాజరైనప్పుడు.. ఆ జనాన్ని చూసి బీఆర్ఎస్ గెలుస్తుందని నమ్మాం. ర్యాలీలు, సభలకు వచ్చిన జనాలను, వారి ఉత్తేజాన్ని చూసిన తర్వాత నల్లగొండలో 12 లో 8 సీట్లు గెలుస్తామన్న విశ్వాసంతో ఉన్నాం. కానీ ఫలితాలు దానికి భిన్నంగా వచ్చాయన్నారు. మన మిత్రుడు భూక్యా జాన్సన్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత దాదాపు 45 నియోజకవర్గాల్లో ఓయూకు చెందిన 20 మంది విద్యార్థులతో సర్వే చేయించారు. ఆ సర్వేలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయని కేటీఆర్ తెలిపారు. మనం తప్పకుండా పార్టీ కుటుంబ సభ్యులుగా కేసీఆర్ బిడ్డలుగా ఆత్మ విమర్శ చేసుకోవాలి. మొన్న జరిగిన పొరపాట్లు పార్లమెంట్ ఎన్నికల్లో జరగకూడదు. పని చేసుకుంటూ వెళ్లిపోయాం.. కానీ ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లలేదు. ఎందుకంటే బీఆర్ఎస్ పాలనలో ఒక లక్షా 60 వేల 283 మంది పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. ఈ దేశంలో ఈ పదేండ్లలో ఏ రాష్ట్రంలో కూడా ఇన్ని ఉద్యోగాలు ఇవ్వలేదు. అంటే దేశంలోనే అత్యధికంగా ఉద్యోగాల భర్తీ చేసి కూడా వాళ్ల మనసు గెలుచుకోవడంలో విఫలమయ్యాం. కేసీఆర్ పాలనలో ఇచ్చిన 30 వేల ఉద్యోగాలు నేనే ఇచ్చానని రేవంత్ రెడ్డి ఊదరగొడుతూ ఉపన్యాసాలు ఇస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చినాక ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. పరీక్ష పెట్టలేదు. ఈ అబద్ధాలను ప్రజలకు, యువతకు వివరించాలి. మనం ఉద్యోగాలిచ్చి కూడా చెప్పుకోలేకపోయాం. అయితే లంబాడీ తండాల్లోని కొంతమంది నిరుద్యోగులు తమకు ఉద్యోగాలు రాలేదు చెప్పారు. పెన్షన్లకు ఆశపడి ఓటు వేయకండి.. తమకు ఉద్యోగాలు వస్తే తామే అంతకు ఎక్కువ ఇస్తామని చెప్పి వృద్ధుల కాళ్లు మొక్కి నిరుద్యోగులు ఓట్లు వేయించారు. మరి లక్షా 60 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పడంలో విఫలమయ్యాం. ఇక గృహలక్ష్మి అనే పథకం ఎన్నికలకు ఏడాది ముందే అమలు చేసి ఉంటే.. ఓట్లు పడేవి అని విద్యార్థులు పేర్కొన్నట్లు సర్వేలో తేలినట్లు కేటీఆర్ చెప్పారు. ఈరాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు 73 శాతం జీతం పెంచిన నాయకుడు కేసీఆర్. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఎక్కువ జీతాలు ఇచ్చాం. కానీ ఉద్యోగులకు దూరమయ్యాం. ఒకటో తేదీన జీతం రాలేదని చెప్పి ఓట్లు వేయలేదు. కరోనాతో పాటు ఇతర సమస్యల వల్ల ఆర్థికంగా వెనుకబడ్డామని చెప్పడంలో విఫలమయ్యాం. రైతులకు కూడా దూరమయ్యాం. అలా ఏదో ఒక కారణంతో ఆయా వర్గాల ఓటర్లకు దూరమయ్యామని కేటీఆర్ తెలిపారు. ఎన్నో ఏండ్లుగా ఉన్న ఫ్లోరోసిస్ భూతాన్ని తరిమికొట్టాం. ఫ్లోరోసిస్ కాంగ్రెస్ ద్రోహమేనని ప్రజలకు చెప్పడంలో విఫలమయ్యాం. నల్లగొండ జిల్లాకు పదేండ్లలో మూడు మెడికల్ కాలేజీలు ఇచ్చామని చెప్పడంలో విఫలమయ్యాం. ఫెయిలైంది మన నాయకుడు కాదు.. తప్పు ప్రజలది కాదు. కేసీఆర్ మనల్ని నమ్ముకున్నాడు. మనమేమో ప్రజలకు చెప్పడంలో విఫలమయ్యాం. ప్రజలేమో అబద్ధాలకు మోసపోయారు. పదేండ్ల నిజం ముందు ఈ వంద రోజుల అబద్ధం ప్రజలకు ఇవాళ కనబడుతుంది. ఏ ఊరికి మన నాయకులు పోయినా ఇట్ల అయితదని అనుకోలేదు. ఇంత మోసం జరుగుతుది అనుకోలేదని. ఇవాళ ప్రజలు బాధపడుతున్నారు. కేసీఆర్ సార్ మళ్లీ నువ్వ రావాలి. నువ్వున్నప్పుడే మంచిగ బతికినం అని ఓ రైతు కన్నీరు పెట్టుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాంగ్రెస్ పాలన ప్రజలకు అర్థమైంది.. మనకు అర్థం కావాలి. మనం గట్టిగా పని చేస్తే ఫలితం వస్తుంది. 2018లో జిల్లా మొత్తంలో 12కి 11 గెలిచాం. నల్లగొండ పార్లమెంట్‌లో 6 గెలిచాం. కానీ పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి స్థానాల్లో ఓడిపోయాం. ఇప్పుడు 11 సీట్లు గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఈ రెండు ఎంపీ నియోజకవర్గాల్లో ఎందుకు ఓడదో ఆలోచించి పని చేయండి. బీజేపీ, కాంగ్రెస్

# అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

జోగులాంబ గద్వాల, అబద్ధపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే కరువు వచ్చిందని, కరెంట్ కష్టాలు ప్రారంభమయ్యాయని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం పిలుపుమేరకు సోమవారం జిల్లాలోని కేటిదొడ్డి మండలం ఉమిత్యాల గ్రామ శివారులో గల వ్యవసాయ పొలంలో ఎండిన పంటలను బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..100 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తానన్న ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని ధ్వజమెత్తారు. డిసెంబర్ 9న రూ. 2 లక్షల రూణమాఫీ అంటూ హామీ ఇచ్చిన కాంగ్రెస్ అన్నదాతలను పూర్తిగా ఆగం చేసిందని మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా ఎండిన పంటలకు ప్రతి ఎకరాకు రూ. 25వేల నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు పరిహారం ఇచ్చేవరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

# స్పీడ్‌గా సిట్ దర్యాప్తు...

హైదరాబాద్ : రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు వేగవంత మైం ది. ఈ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. రో జుకో ట్విస్టు చోటు చేసుకుంటోంది. కేసులో కీలకంగా ఉండి, పరారీలో ఉన్న ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు సోమవారం హైదరాబాద్‌కు రానున్నట్లు సమాచారం. మరోవైపు ఈ కేసులో నిందితులైన పోలీస్ అధికారుల నేరాగీకారం, కస్టడీ రి పోర్టు ఆధారంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోని ప్రముఖ లీడర్లకు నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. సదరు నేతల్లో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులు, ముగ్గురు ఎంఎల్ఎలు, ఇద్దరు ఎంఎల్‌సిలు ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు ఇప్పటికే న్యాయ సలహాలు తీసుకుంటున్నట్టు తెలిసింది. దర్యాప్తులో సేకరించిన నిందితుల కాల్‌డేటా, వాట్సాప్ చాటింగ్స్, ఫార్మా, రి యల్ ఎస్టేట్, ఐటి కంపెనీలకు చెందిన బాధితులు అందించిన సమాచారం ఆధారంగా సంబంధిత లీ డర్లకు నోటీసులు ఇవ్వనున్నారు. ఇందుకు ప్రణీత్‌రావు, టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్‌రావు స్టేట్‌మెంట్ కీలకంగా మారినట్టు తెలిసింది. అధికార పార్టీకి చెందిన పలువురు నేతలు చెప్పిన విధంగా ఆపరేషన్స్ చేసినట్టు పోలీసు దర్యాప్తులో వీరిద్దరు వెల్లడించినట్టు సమాచారం. ఎస్ఐబి లాగర్ రూ మ్ నుంచి డిఎస్‌పి ప్రణీత్ రావు అందించిన ఫోన్‌నెంబర్స్, వాయిస్ రికార్డింగ్స్ ఆధారంగా గత ఎలక్షన్స్ సమయంలోరాధాకిషన్ రావు టీమ్ స్పెషల్ ఆపరేషన్స్ చేసిన సంగతి ఇప్పటికే వెల్లడైంది. ఇందులో అధికార పార్టీ మినహా ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు చెందిన అభ్యర్థులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా ఉన్న కీలక నాయకుల డబ్బులను పట్టుకున్నారు. కంపెనీల అవసరాల కోసం బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు తీసుకెళ్తున్న డబ్బులను కూడా సీజ్ చేశారు. ముఖ్యనాయకుల అనుచరులు, ఆర్థిక వ్యవహారాలు చూసే సిబ్బంది ఫోన్లను ట్యాప్ చేశారు. డబ్బుతో ప్రయాణించే వారి వివరాలతో నిఘా పెట్టారు. స్పెషల్ ఆపరేషన్‌లో పట్టుకుని సీజ్ చేశారు. ఇలా స్వాధీనం చేసుకున్న డబ్బులో కొంతమాత్రమే లెక్కలు చూపేవారని ఆరోపణలు న్నాయి. పార్టీ ఫండ్, క్యాష్ ట్రాన్స్‌పోర్ట్ చేసేందుకే ఎస్ఐబి,టాస్క్‌ఫోర్స్, ఎస్వోటీ పోలీసులను వాడుకున్నారని పోలీస్ దర్యాప్తులో వెలుగు చూసినట్టు సమాచారం. ఫోన్ ట్యాపింగ్, బ్లాక్ మెయిలింగ్, బడా వ్యాపార వేత్తలు, ప్రముఖ కంపెనీలు, కాంట్రాక్టర్ల ద్వారా రూ.వందల కోట్లు ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేయించారని ప్రత్యేక దర్యాప్తు బృందం గుర్తించినట్టు సమాచారం. ఈ మేరకు నిందితులు తెలిపిన వివరాలతో బాండ్లు కొనుగోలు చేసిన వ్యక్తులు, కంపెనీల వివరాలను సేకరిస్తున్నట్టు తెలిసింది. ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేయడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఇందుకుగాను ఆయా సంస్థలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి చేకూరిందనే కోణంలో పరిశోధన జరుగుతున్నది. ఈ క్రమంలోనే ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు, భుజంగరావు, తిరుపతన్న స్టేట్‌మెంట్స్ ఆధారంగా సంబంధిత లీడర్లకు నోటీసులు ఇచ్చే అవకా శాలు ఉన్నట్టు సమాచారం. మునుగోడు, హుజూరాబాద్, దుబ్బాక ఉప ఎన్నికల సమయంలో ఎలక్షన్ కోడ్ అమల్లోకి రాకముందే ప్రణీత్‌రావు టీమ్ ఆపరేషన్స్ ప్రారంభించింది. గత ప్రభుత్వ పెద్దలు అందించిన ఫోన్ నెంబర్లు ట్యాప్ చేసి, టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందించింది. దీంతో రాధాకిషన్ రావు టీమ్ ప్రతిపక్షపార్టీలకు చెందిన డబ్బు రవాణాను అడ్డుకు న్నారు. దీంతోపాటు హవాలా డబ్బును పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. అయితే, తనిఖీల్లో పట్టుబడ్డ డబ్బు చేతులు మారినట్టు సమా చారం. చాలా మంది హవాలా వ్యాపారులు ఎలాంటి కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు అధికారులు అడిగినంత అప్పగించారని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో వెలుగు చూసినట్టు తెలిసింది. వీటికి సంబంధించిన పూర్తి ఆధారాలను ప్రత్యేక దర్యాప్తు బృందం సేకరిస్తున్నట్టు సమాచారం. మరోవైపు తిరుపతన్న, భుజంగరావు వాడిన కంప్యూటర్స్, సెల్‌ఫోన్స్ ను అధికారులు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. సోమవారం నాంపల్లి కోర్టులో రాధాకిషన్ రావును వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలంటూ దర్యాప్తు బృందం పిటిషన్ వేయనుంది.

నా ఫోన్ ట్యాప్ చేసి రూ.కోట్లు వసూలు చేశారు

ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నల విచారణ మూడో రోజు కొనసాగింది. మరోవైపు తన ఫోన్ ట్యాప్ చేశారని రియల్ ఎస్టేట్ వ్యాపారి సంధ్యా శ్రీధర్ రావు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో రాధాకిషన్‌రావుపై ఫిర్యాదు చేశారు. తన ఇంటికి వచ్చి రాధాకిషన్‌రావు రూ.కోట్లు తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపన్నల విచారణ మూడో రోజు కొనసాగింది. వారిద్దరూ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా మరికొంత మందికి నోటీసు లిచ్చేం దుకు దర్యాప్తు బృందం సిద్ధమైన ట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో నలుగురు పోలీసు ఉన్నతాధికారులు అరెస్టయ్యారు. తాజాగా ఇద్దరు అదనపు ఎస్పీల వాంగ్మూలం ఆధారంగా, మరికొంత మంది పేర్లు తెరపైకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. వెస్ట్ జోన్ డిసిపి విజయ్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం కొనసాగిస్తున్న దర్యాప్తులో భాగంగా రాధాకిషన్‌రావుతో పాటు భుజంగరావు, తిరుపతన్నలు వెల్లడించిన వివరాలను పోలీసులు క్రాస్ చెక్ చేస్తున్నారు. ట్యాపింగ్ వ్యవహారం ఒక్కటే కాకుండా, టాస్క్‌ఫోర్స్‌లో సుదీర్ఘకాలం కీలకంగా ఉన్న రాధాకిషన్ రావుకు సంబంధించి మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. మరోవైపు ఫోన్ ట్యాపింగ్‌తో అక్రమంగా కోట్ల రూపాయలు కూడబెట్టారంటూ కొంతమంది బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

వ్యాపారినీ విచారించిన సిట్

టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావుపై ఫిర్యాదు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సంధ్యా శ్రీధర్‌రావుని అధికారులు విచారించారు. న్యాయవాదితో కలిసి విచారణకు హాజరైన ఆయన వాంగ్మూలాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందం రికార్డు చేసింది.

# అధికారంలోకి వచ్చేది టిడిపి కూటమి

విజయవాడ, తూర్పు నియోజకవర్గంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్ని హామీ ఇచ్చారు. రాబోయేది టిడిపి ఉమ్మడి కూటమి ప్రభుత్వమేనని అన్నారు. సోమవారం విజయవాడ తూర్పు నియోజకవర్గం గుణదలలో కేశినేని చిన్ని, గద్దె రామ్మోహన్ పర్యటించారు. అమ్మ కళ్యాణ మండపం వద్ద కేశినేని చిన్నికి, గద్దె రామమోహన్‌కు స్థానికులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ.. వచ్చేది టీడీపీ, బీజేపీ, జనసేన ప్రభుత్వమే ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా రానున్న రోజుల్లో పాలన ఉండబోతుందన్నారు. యువతకు పెద్ద ఎత్తున ఉపాధికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రణాళికాబద్ధంగా, నిర్ణీత కాల వ్యవధిలో అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. విజయవాడ పార్లమెంట్‌లో ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం పడుతున్నారని కేశినేని చిన్ని పేర్కొన్నారు.

# పెన్షన్ల నిలిపివేతలో టిడిపి హస్తం

విశాఖపట్నం,ఏపీలో పెన్షన్ల పంపిణీ అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పెన్షన్ల పంపిణీకి మరో పది రోజుల సమయం పడుతుందన్న ఏపీ ప్రభుత్వ ప్రకటనపై టీడీపీ అభ్యంతరం చెబుతోంది. తాజాగా ఈ అంశంపై మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రత్యేకంగా ప్రజల్ని ఏప్రిల్ ఫూల్ చేస్తున్నారని అన్నారు. పెన్షన్ల ఆపేయాలని ఎవరు ఎన్నికల కమిషన్‌కి వెళ్లారని ప్రశ్నిస్తూ.. ఇప్పుడు తిరిగి తమపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నూటికి నూరు శాతం పేదవాడి మీద కక్షతో, పేదవాడికి అందకుండా చూడాలని బుద్ధితో ఇలా చేస్తున్నారని ఆరోపించారు. ఫర్ సిటిజన్ డెమోక్రసీ పేరుతో నిమ్మగడ్డ రమేష్ లాంటి వ్యక్తులు, చంద్రబాబుకు వత్తాసు పలికేందుకు ఇదంతా చేశారని దీనిని తీవ్రంగా ఆక్షేపిస్తున్నామన్నారు. చంద్రబాబు సంగనాచిలా ప్రత్యేక ఏర్పాటు చేయాలని లేఖలు రాస్తున్నారని మండిపడ్డారు. పెన్షన్ ఇవ్వడంలో అక్కడ అవినీతి జరిగిందంటే తాను తలదించుకొని వస్తానన్నారు. వాలంటీర్ వ్యవస్థలోవలో చేస్తే అందరికీ దాని ఆపాదించడం కరెక్ట్ కాదన్నారు. పెన్షన్ పంపిణీకి ప్రత్యేకమైన వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. వాలంటీర్లో, తాత్కాలిక ఉద్యోగులైనా మెర్సి లెటర్ పెట్టుకుంటే కన్సిడర్ చేస్తారు... అలాంటిది వారికి అవకాశాలు ఉండవా అని అన్నారు. ఎన్నికల ముందే ప్రజలు తిరిగి పెన్షన్ కార్యాలయాలకు వెళ్లి పెన్షన్లు తెచ్చుకుని దుస్థితి తీసుకువచ్చారని మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శలు గుప్పించారు.

# అప్పుడు రామ సేతు.. ఇప్పుడు కచ్చతీవు రచ్చ

న్యూఢిల్లీ,దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. అన్ని పార్టీలు ప్రచారంలో తలమునకలై ఉన్నాయి. విమర్శలు, ప్రతివిమర్శలు, దూషణలు, వాగ్బాణాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్నో ఏళ్ల క్రితం జరిగిపోయిన విషయాలను కూడా ఇప్పుడు ప్రస్తావిస్తూ కొత్త చర్చకు ఆయా పార్టీల నేతలు తెరతీస్తున్నారు. / తాజాగా భారత్, శ్రీలంక మధ్యలో హిందూ మహాసముద్రంలోని రామేశ్వరం దీవికి అతి సమీపంలో ఉన్న కచ్చతీవు వ్యవహారం ఇప్పుడు ముదిరిపాకాన పడుతోంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ కచ్చతీవును అంశాన్ని కెలకడం, ఈ దీవిని 1974లో ఇందిరాగాంధీ ప్రభుత్వమే శ్రీలంకకు ఇచ్చిందంటూ తీవ్ర విమర్శలు చేయడం తెలిసిందే. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై సమాచార హక్కు చట్టం ద్వారా కచ్చతీవుపై సమాచారం తీసుకొని 1974లో ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ.. అప్పటికి భారత్ లో ఉన్న కచ్చతీవును శ్రీలంకకు అప్పగించారని వెల్లడైంది. దీంతో ఈ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారం సందర్భంగా తీవ్ర విమర్శలు ఎక్కుపెట్టారు. మరోవైపు కాంగ్రెస్ కూడా దీటుగా బదులిస్తోంది. మరి బంగ్లాదేశ్ తో సరిహద్దు ఒప్పందం సందర్భంగా 111 భారత్ ప్రాంతాలను బంగ్లాదేశ్ కు ఎందుకిచ్చారని మోదీని నిలదీస్తోంది. ఈ నేపథ్యంలో విదేశాంగ మంత్రి జైశంకర్ కచ్చతీవు వ్యవహారంపై హాట్ కామెంట్స్ చేశారు. కచ్చతీవు కేవలం ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆకస్మాత్తుగా తెరమీదకొచ్చిన అంశం కాదని తెలిపారు. పార్లమెంటు, కేంద్రం, తమిళనాడు ప్రభుత్వాల మధ్య ఈ అంశంపై ఎన్నో ఏళ్లుగా చర్చ జరుగుతూనే ఉందన్నారు. కచ్చతీవు వ్యవహారంపై తమిళనాడు ప్రభుత్వానికి 21 సార్లు తాను జవాబు ఇచ్చానని వెల్లడించారు. అప్పటి ప్రధానులు భారత భూభాగాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులోని డీఎంకే పార్టీపైనా కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ విరుచుకుపడ్డారు. కచ్చతీవును అప్పగించేటప్పుడు నాడు అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం సమాచారం ఇచ్చిందన్నారు. కానీ డీఎంకే తమకు తెలియదని నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు. రాజ్యాంగ సవరణ లేకుండా భారత భూభాగాలను వేరే దేశానికి అప్పగించడానికి అవకాశం లేని నేపథ్యంలో కచ్చతీవుపై ఒక పరిష్కారానికి రావాల్సి ఉందని జైశంకర్ తెలిపారు. ఈ వ్యవహారంపై శ్రీలంక ప్రభుత్వంతో కలిసి నిర్ణయానికి రావాల్సి ఉంటున్నారు. కాగా కచ్చతీవు చాలా చిన్నదీవి. ఇక్కడ జనం ఎవరూ ఉండటం లేదు. అయితే మత్స్య సంపద మాత్రం పుష్కలంగా ఉంది. భారతీయ మత్స్యకారులు ముఖ్యంగా తమిళనాడుకు చెందినవారు చేపల వేట సందర్భంగా తెలియకుండానే శ్రీలంక జలాల్లో ప్రవేశిస్తున్నారు. దీంతో శ్రీలంక మన మత్స్యకారులను బంధిస్తోంది. అలాగే కచ్చతీవు సమీపంలోకి వెళ్లినవారిని కూడా వదిలిపెట్టడం లేదు. వాస్తవానికి కచ్చతీవును శ్రీలంకకు అప్పగించినా ఒప్పందం ప్రకారం మన మత్స్యకారులు కూడా చేపల వేట సాగించుకోవచ్చు. కానీ శ్రీలంక ఇందుకు తూట్లు పొడుస్తోంది. తమిళనాడులో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ కచ్చతీవు దీవం గురించి మాట్లాడారు. 1973 వరకు కచ్చతీవు మనదేశంలోనే ఉంటున్నారు. 1974లో నాటి భారత ప్రధాని ఇందిరాగాంధీ కచ్చతీవును శ్రీలంకకు ఇచ్చేశారని.. దీనివల్ల ఆ మూల్యాన్ని ఇప్పటికీ చెల్లించుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు.

### చర్చిలో ప్రార్థనలకు వెళ్లిన ఎంపి

బాపట్ల,వైసీపీ ఎంపీ నందిగం సురేష్‌కు సొంతపార్టీలోనే చేదు అనుభవం ఎదురైంది. ఎలక్షన్ కోడ్ వర్తించదు' అన్న రీతిలో ప్రచారాన్ని నిర్వహించిన ఎంపీ సురేష్‌కు సొంత పార్టీ నేతల నుంచి వ్యతిరేకత ఎదురైంది. అద్దంకి నియోజ వర్గం పరిధిలోని బల్లికురవ మండలం, కొప్పెరపాడు గ్రామంలో చర్చిలోకి పార్టీ జెండాలు, కండువాలతో ఎంపీ ప్రవేశించారు. నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్ పాణెం హనిమిరెడ్డి తో కలిసి ఆయన ప్రార్థనలు నిర్వహించారు. ఇంతలోగా ఫాన్ పార్టీ మరో వర్గానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో

# బిఆర్ఎస్‌కు పొగపెడుతున్న రాజకీయాలు !

హైదరాబాద్,రాజకీయాలు ఎప్పుడూ అధికారం చుట్టే తిరుగుతాయి. అధికారం ఉన్న పార్టీకే ఆకర్షణ ఎక్కువ. సిద్ధాంత నిబద్ధతలకు ఇక్కడ తావు లేదు. అందుకే ఏ పార్టీలో గెలిచామన్న దానికి నేతలు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అధికారంలో ఉన్న పార్టీలో ఉన్నామా లేమా అని బేరీజు వేసుకుంటున్నారు. కెసిఆర్ నేర్పిన సిద్ధాంతం ఇది. ఆయన నేర్పిన సిద్ధాంతాన్నే ఇప్పుడు కాంగ్రెస్ అనుసరిస్తోంది. గతంలో కాంగ్రెస్, సిపిఐ, టిడిపి ఎమ్మెల్యే నను నిస్సిగ్గుగా టిఆర్ఎస్‌లో చేర్చుకుని తెలంగాణ పునరేకీకరణ ముద్ర వేశారు. ఈ సూత్రాలే ఇప్పుడు పునరావృతం అవుతుంటే బిఆర్ఎస్ భుజాలు తుడుముకుంటోంది. సిగ్గు సిగ్గు అంటూ శివాలు వేస్తోంది. కెటిఆర్ లాంటి వారు రాజకీయ బేహారులు అంటూ విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలంటేనే తిమ్మిని బమ్మిని చేయడం..ఎత్తులు పైఎత్తులు వేయడం....ఎదుటి వారిని బురిడీ కొట్టించడం.. అబద్దాలుచెప్పడం..ఆచరణ సాధ్యం కాని హామీలు గుప్పించడం.. ఓటర్లను ప్రలోభ పెట్టడం...ఇవన్నీ సర్వసాధారణం. మనమెంత నిజాయితీగా ఉన్నా..ఎదుటివారు అనుసరించే ఎత్తులను గమనించి ముందుకు సాగాలి. మనం నిజాయితీగా ఉంటూనే చెడును దునుమాడే ధైర్యం కూడా సొంత చేసుకోవాలి. రాజకీయంగా మనమెంత బలంగా ఉన్నా.. ఎదుటి పక్షం మనపై నిరంతరం బురదజల్లే ప్రయత్నం చేస్తుంది. బట్టకాల్చి మీద వేస్తుంటారు... ఇలాంటి అనుభవాలు మనకు లేకున్నా భరించాల్సిందే. అయితే వీటిని దీటుగా ఎదుర్కోవాలి. గట్టిగా తిప్పికొట్టాలి. ముల్లును ముల్లుతోనే తీయాలన్న సామెతను ఆధారం చేసుకుని ముందుకు సాగాలి. ప్రజల కోసం రాజకీయంలోకి దిగిన పార్టీలు కావచ్చు..నేతలు కావచ్చు...అందుకు దీటుగా ప్రచారాస్త్రాలను సంధించా ల్సిందే.. అందుకు వారి వాదనల ను బలంగా ప్రజలకు చేరవేయాల్సిందే. కొత్తగా నినాదాలు సిద్ధం చేసుకోవాల్సిందే.. అయితే ఇదే క్రమంలో మనం చేసిన మంచిని ఒకటికి పదిసార్లు పదేపదే ప్రజల చెంతకు చేర్చాలి. అభివృద్ధి పనులను ప్రజల్లో చర్చ జరిగేలా చేయాలి. గత ఐదేళ్లలో ఏ పనికి ఎంత మొత్తం కేటాయించామో చర్చ జరిగేలా చేయాలి. ఎన్ని మంచిపనులు చేశామో లెక్కలతో సహా చెప్పగల గాలి. అలాగే అవినీతికి ఎంతగా దూరం ఉన్నామో కూడా ముఖ్యం. అలాగే అభివృద్ధి కళ్లకు కనపడుతుందా అన్నది కూడా ముఖ్యమే. కానీ ప్రచారంలోనే అభివృద్ధిని చూపి అవినీతికి,అక్రమాలకు, అధికార దుర్విని యోగానికి పాల్పడ్డ విషయాలను బిఆర్ఎస్ నేతలు కనపడకుండా చేశామని అనుకున్నారు. అయితే ప్రజలకు ఇదంతా తెలిసిపోయింది. అందుకే బిఆర్ఎస్ అవినీతిని, అహంకారాన్ని భరించలేక పోయారు. బిఆర్ఎస్ విషయంలో ఇదే జరిగింది. సామాజిక మాధ్యమాలు బలంగా ఉన్న ఈ కాలంలో ప్రతి చిన్న అవినీతి, అక్రమం క్షణాల్లో ప్రజలకు చేరిపోతోంది. ప్రజల అభిప్రాయాలను తీసుకుని చేసిన మంచిని ప్రజల ముందుంచడంతో పాటు అవినీతి మట్టి అంటుకోకుండా పాలన చేయాల్సి కెసిఆర్ ..కేవలం కుటుంబ పాలనకు తెరతీసారు. అక్రమాలకు పాల్పడ్డారు. అవినీతిని సొంతం చేసుకున్నారు. అంతకు మించి ప్రజలతో మనకేమి సంబంధం అన్న రీతిలో వారిని దూరం పెట్టారు. ఒక సిఎం ప్రజలను కలవాల్సిన పనిలేదని చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో తీవ్రంగా ప్రభావం చూపింది. అందుకే కాంగ్రెస్, బిజెపలను లక్ష్యంగా చేసుకుని వారి విమర్శలను గట్టిగా తిప్పికొట్టినా ప్రజలు




నమ్మడం లేదు. అందుకే నేతలు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. లేదా బిజెపిలో చేరుతున్నారు. ఈ రెండు పార్టీల క్ష్యం ఒక్కటే. బిఆర్ఎస్‌ను దెబ్బతీయడం. దీనిని దెబ్బతీసినా ప్రజల్లో సానుభూతి లేదు. అయ్యో కెసిఆర్ అని ఏ ఒక్కరూ అనడం లేదు. ఎందుకంటే స్వయంకృతం తప్ప మరోటి కాదు. ప్రజల్లో సానుభూతి లేకుండా చేసుకున్న పార్టీ ఏదైనా ఉందంటే అది కేవలం బిఆర్ఎస్ మాత్రమే. గతంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్న పార్టీలన్నీ మళ్లీ ప్రజల్లో నిలవగలిగాయి.అందుకు టిడిపి, కాంగ్రెస్, బిజెపిలను చూస్తే తెలుస్తుంది. ఇకపోతే కెసిఆర్ వద్ద అధికారం ఉన్నా ఇంతకాలం నేతలు అణగిమణిగి ఉన్నారు. అధికార పార్టీలో ఉండాలన్న లక్ష్యంతో ఉన్నారు. ప్రజల సమస్యలను, ప్రజాప్రతినిధుల నుంచి తెలుసుకునే ప్రయత్నం ఏనాడూ కుటుంబ సభ్యులు చేయలేదు. అందుకే అధికారం పోవడంతో కెసిఆర్ రాజరికాన్ని భరించడం,తట్టుకోవడం సాధ్యం కాదు కనక ఒక్కొక్కరే జారుకుంటున్నారు. దానం నాగేందర్ కావచ్చు...కెకె కుటుంబం కావచ్చు..కడియం కుటుంబం కావచ్చు.. అందరిదీ ఒకటే అనుభవం. ఇందులో ఓ మంచి ప్రయత్నం ఏమంటే కెకె నేరుగా కెసిఆర్‌ను కలసి పార్టీ మారే విషయం చెప్పారు. ఆయన నిజంగానే అభినందనీయుడు. ఈ క్రమంలోనే తెలంగాణలో వలసల రాజకీయం తారాస్థాయిలో ఉంది. అధికార పార్టీలోకి ప్రతిపక్షాల నాయకులు ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకులు జంప్ చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ముందు జరుగుతున్న పరిణామాలు గులాబీ పార్టీ అధినాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఓ స్థాయి నేతలు వెళ్లడం వేరు... ఇప్పుడు ఏకంగా లోక్‌సభ బరిలో ఉన్న నేతలు వెళ్లిపోవడం మింగుడుపడటం లేదు. కేకే, ఆయన కుమార్తె, కడియం ఆయన కుమార్తె కావ్యలు మూకుమ్మడిగా మరికొందరితో కలిసి చేయి అందుకోవడం తట్టుకోలేక పోతున్నారు. ఇదంతా ఎందుకు జరుగుతుందన్న ఆత్మవిమర్శలు చేసుకోకుండా విమర్శలకు దిగడం ద్వారా బిఆర్ఎస్ మరితం పలుచన అవుతోంది. శూన్యం నుంచే సునామీ సృష్టించిన కేసీఆర్ ఇప్పుడు జరుగుతున్న పరిణామాలకు బెదిరిపోతారా అంటు కెటిఆర్ ప్రశ్నించడం చూస్తే ఆయన ఎంత అవివేకి అన్నది తెలుస్తుంది. రాజకీయాల్లో మన సమయం వచ్చినప్పుడే అడుగులు వేయాలి. వేసిన అడుగులు బలంగా ఉన్నాయా లేదా అన్న విచోణ చేయాలి. లేవంటే అది మన దృష్టి లోపంగా తెలుసుకోవాలి. ఈ నిజాన్ని బిఆర్ఎస్ తెలుసుకుంటే మంచిది.

# ఫోన్ ట్యాపింగ్‌లు...డబ్బుల పంపిణీ ప్రకంపనలు !




హైదరాబాద్,ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఫోన్ ట్యాపింగ్ లాగితే అనేక విషయాలు బయట పడుతున్నాయి. ఇందులో టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యలంలో ఎన్నికల్లో డబ్బుల పంపిణీ జరిగినట్లు తాజాగా గుర్తించారు.ఎన్నికల్లో గెలవడానికి, విపక్షాలను నిలవరించడానికి ఎంతగా అధికార దుర్వినియోగం జరిగిందో గమనించవచ్చు. నిజంగా ఇంత దారుణం జరగడం క్షమించరాని నేరంగా పరిగణించాలి. ఎన్నిక ల్లో గెలవడం కోసం పోలీసులను ఉపయోగించుకుని బయటపడుతన్నామన్న ధీమాతో ఉన్నప్పటికీ ప్రజలు ఇచ్చిన సాక్‌తో కెసిఆర్ మైండ్ బ్లాక్ అయ్యింది. ఎపిలోనూ ఇంతకాలం ఇదే తరహాలో వ్యవహారం నడిచిందని తెలుస్తోంది. అక్కడా ప్రభుత్వం మారితేనే అసలురంగు బయటపడుతుంది. గతంలో వైఎస్ హయాంలో 108 వాహనాల్లో డబ్బుల సరఫరా జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడేమో పోలీసుల సమక్షంలోనే ఇలా డబ్బుల చేరవేత జరిగిందన్న ఆరోపణలు రావడం దుర్మార్గమైన కిరాతక చర్యగా చూడాలి. ప్రజలకోసం అని బయలుదేరి రైతులను పరామర్శించేందుకు వెళ్లిన కెసిఆర్ హుంకరింపులు చూస్తే సాధారణ తెలంగాణ వాసులు గుండెలు మండుతున్నాయి. ఆయనలో ఉన్న అసహనం బయట పడుతుంది. ఇన్ని అవకతవకలు బయటపడుతున్నా ఒక్కమాట కూడా మాట్లాడకుండా, ప్రభుత్వంపై నిందలు వేసే ప్రయత్నం చేయడం..దొంగేదొంగ అన్నట్లుగా ఉంది. ఇంతకాలం కెటిఆర్, హరీష్ రావు, కవితలు మాత్రమే ఇలా అసహనం వ్యక్తం చేశారు. ఇప్పుడు కెసిఆర్ కూడా తన అక్కసును వెళ్లగక్కుతున్నారని అర్థం అయ్యింది. అధికారం పోవడంతో కెసిఆర్ రంకెలు వేస్తున్నారు. కెసిఆర్ హయాంలో సిట్ అధికారులు ఎంత అరాచకంగా వ్యవహరించారో ఇప్పుడు తెలంగాణ పోలీసుల విచారణలో బయట పడుతుంటే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. కొంతమంది అధికారులు ఉన్నతస్థాయి ఆదేశాల మేరకు తాము పోలీస్ అధికారులం అన్న విషయం విస్మరించి, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకంటే అధ్వానంగా డబ్బులను కూడా పంచారన్న విషయం చూస్తుంటే ఎంతగా బరితెగించారో అర్థం చేసుకోవచ్చు. విచారణ సమయంలో ఇప్పుడు అదుపులోకి తీసుకున్న పోలీసు అధికారుల్లో అత్యధికులు కెసిఆర్ సామాజిక వర్గానికి చెందినవారు కావడం కూడా కులగజ్జితో ఎంతకు తెగించారన్న విషయం మరింత ఆగ్రహం కలిగిస్తోంది. అంటే కులరక్కసి ఎంతగా పనిచేసిందో అర్థం చేసుకోవచ్చు. ఒకే సామాజిక వర్గానికి చెందిన కొందరు పోలీసు అధికారులు విచ్చలవిడితనంతో తెలంగాణను గుప్పిట పెట్టుకుని అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించారన్నది ప్రజలకు తెలిసి వస్తోంది. ఇప్పుడు పలువురుని ప్రశ్నిస్తే మా ఫోన్లు కూడా ట్యాపింగ్‌లో ఉన్నాయిని చెబుతున్నారు. ఏకంగా ఓ బిల్డర్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. తన ఫోన్ ట్యాపింగ్ చేసి తనను బెదిరించి కోట్లు కొల్లగొట్టారని ఆరోపించాడు. ఇప్పుడా విషయంలోనూ విచారణ సాగుతోంది. కెసిఆర్ ప్రభుత్వం గద్దె దిగాక ...స్వేచ్ఛ వచ్చింది.. ఫోన్లు మాట్లాడే స్వేచ్ఛను పొందామని ప్రొఫెసర్ కోదండరామ్ చెప్పడం చూస్తే వీటి ఆగడాలు ఎంతగా మితిమీరి పోయాయో గమనించవచ్చు. ఎపిలోనూ ఇలాంటి తతంగమే జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. టిడిపి ఈ విషయంలో ఆరోపణలు చేస్తూనే ఉంది. అంటే తెలుగు రాష్ట్రాల్లో ఫోన్ ట్యాపింగ్ అన్నది ఒకే తరహాలో సాగిందని అర్థం చేసుకోవచ్చు. ఇరువురు ప్రభుత్వాధినేతలు కూడ బలుక్కుని చేశారని అనిపిస్తోంది. ఇకపోతే తమ ఫోన్లు ట్యాపింగ్ అవుతున్నాయి, దీంతో తమ కార్యకర్తలను అరెస్ట్ చేస్తున్నారని పిసిసి చీఫ్‌గ ఆఉన్న సమయంలో రేవంత్ తీవ్ర ఆరోపణలు చేశారు. నాటి ఇంటిలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు పేరు చెప్పి గట్టి హెచ్చరికుల చేశారు. ఈ క్రమంలో ఆనాటి ప్రభుత్వంలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్కేంద్రంగా సాగిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పాత్రధారిగా భావిస్తున్న టి.ప్రభాకర్‌రావు పోలీసుల ఎదుట లొంగి పోనున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు అరెస్టయిన పోలీసు అధికారులు.. దర్యాప్తులో ప్రభాకర్‌రావు చెప్పినట్లు చేశాం అంటూ వాంగ్మూలం ఇవ్వడంతో అన్ని వేళ్లు ఎస్ఐబీ మాజీ చీఫ్ వైపే చూపుతున్నాయి. దాంతో ప్రభాకర్‌రావు అమెరికా నుంచి తిరుగు ప్రయాణ మయ్యారనే సంకేతాలు వస్తున్నాయి. గత ప్రభుత్వం చెప్పింది మేం చేశాం ప్రభాకర్ రావు ఇప్పటికే ఓ పోలీస్ అధికారితో వ్యాఖ్యానించారనే విషయం తెలిసిందే..!మొత్తంగా టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు దర్యాప్తులో చెబుతున్న విషయాలు విస్తు గొలిపేవిగా ఉన్నాయి. తెలంగాణలో ఎన్నికల సందర్భంగా వారు ఏం చేశారో కూడా విచారణ సందర్భంగా నిందితులైన అధికారులు చెప్పుకొచ్చారు. ప్రత్యర్థి రాజకీయ పార్టీలు నగదు తరలించకుండా కట్టడి చేయడంతోపాటు అధికార పార్టీకి చెందిన నగదును పోలీసు వాహనాల్లో తరలించామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా కొందరు అధికారులు తమ పరిమితిని అతిక్రమించి వ్యవహరిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. రేపు ఆంధప్రదేశ్‌లో ప్రభుత్వం మారితే అడ్డూ అదుపు లేకుండా వ్యవహరించిన అధికారులు మూల్యం చెల్లించుకోక తప్పదు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులపై టెలిగ్రాఫ్ చట్టం ప్రయోగించాలని తెలంగాణ పోలీసులు నిర్ణయించుకొని న్యాయస్థానం అనుమతి కోరారు. న్యాయస్థానం అనుమతిస్తే నిందితులపైన టెలిగ్రాఫ్ చట్టం కింద కేసు పెడతారు. అప్పుడు విచారణలో నేరం రుజువైతే ఉద్యోగాలు పోవడమే కాకుండా జైలుకు వెళ్లాల్సి వస్తుంది. మొత్తంగా కేసీఆర్ ప్రభుత్వం ఎంత అడ్డగోలుగా వ్యవహరించిందో తెలిపే సంఘటనలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. వీటన్నిటి పైనా విచారణ చేయించి కఠినంగ ఆశిక్షిస్తే తప్ప అధికారంలో ఉన్నప్పుడు రాజకీయ నేతలు చేసిన ఆగడాలకు అడ్డుకట్టవేయలేం. ఇలాంటి నేతలను గుర్తించి ప్రజలు వారిని దూరం పెట్టాలి. ఇలాంటి వారిని ఆదరిస్తే నష్టపోయేది ప్రజలే అని తెలుసుకోవాలి.

## రైతులకు న్యాయం చేసేందుకు పక్కా ప్రణాళిక

పెద్దపల్లి,కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల విషయంలో ఒక ప్రణాళిక బద్దంగా ముందుకు వెళ్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో చట్టప్రకారం శిక్షపడుతుందని అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. వర్షాలు అధిక శాతంలో పడకపోవడం వల్ల నీటి ఎద్దడి ఏర్పడిందని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. రైతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వం మాటల వరకే పరిమి తం తప్పా ఆచరణలో పెట్టలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీరు అందిస్తుందన్నా రు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మిస్తాం. ఆ తర్వాతే ఎన్నికలకు పోతామని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎంపీ సీట్లు గెలవడం కోసం రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పంట నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటామన్నారు.

# జగన్ అక్రమాస్తుల కేసుల్లో విచారణ

న్యూఢిల్లీ,జగన్ అక్రమాస్తుల కేసుల్లో విచారణ ఎందుకు ఆలస్యమవుతోందని సీబీఐని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దీనికి గల కారణాలు చెబుతూ నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని.. విచారణ వేగంగా పూర్తిచేయాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం ఆదేశించింది. డిశ్చార్జ్ పిటిషన్ల కారణంగా జాప్యమవుతోందని సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు కోర్టుకు తెలిపారు. రాజకీయ కారణాలతో ట్రయల్ ఆలస్యం కాకూడదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రాజకీయ నేత, సీఎం అనే కారణాలతో విచారణలో జాప్యం జరగకూడదని జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు. బెయిల్ రద్దు, కేసు విచారణ తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ పిటిషన్లను కలిపే విచారణ చేపడతామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 5 నుంచి ప్రారంభమయ్యే వారానికి వాయిదా వేసింది. ఏపీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో ఆయన బెయిల్‌ను రద్దు చేయాలన్న ఎంపీ రఘురామ కృష్ణరాజు వేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జగన్ కేసుల విచారణలో జాప్యంపై కారణాలు తెలపాలని సీబీఐని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. రఘురామ పిటిషన్ల పై జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ నిర్వహించింది. జగన్ కేసుల విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని కూడా రఘురామ మరో పిటిషన్ దాఖలు చేశారు. రెండు పిటిషన్లపై జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం విచారణ జరిపింది. రెండు పిటిషన్లపై రిప్లైకి సీఎం జగన్ మరింత సమయం కోరారు. తదుపరి విచారణ ఆగస్ట్ 5 కి వాయిదా వేసింది. నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం ఆదేశించింది. బెయిల్ రద్దు, హైదరాబాద్ నుంచి ట్రయల్ మరో రాష్ట్రానికి బదిలీ పిటిషన్లను కలిపే విచారణ చేపడుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణ ఆగస్టు 5 నుంచి ప్రారంభం అయ్యే వారానికి వాయిదా వేసింది.

# బీజేపీ వాషింగ్ మెషీన్..

న్యూఢిల్లీ, ప్రత్యర్థులుగా ఉన్నప్పుడు వారంతా అవినీతిపరులు. పార్టీలోకి వచ్చాక వారే ఆదర్శవంతులు. అవతలి పార్టీలో ఉంటే వారిపై నిందారోపణలు. కాషాయ కండువా కప్పుకున్నాక వారికే నీరాజనాలు. లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీ మార్క్ రాజకీయమిది. గతంలో అవినీతిపరులని ఆరోపించిన నేతలనే రెడ్‌కార్పెట్ పరిచి పార్టీలోకి చేర్చుకుంటున్నది. బీజేపీ కండువా కప్పేసి పునీతులను చేసేస్తున్నది. పార్టీ టికెట్లు కేటాయిస్తున్నది.ఆఖరికి పార్టీ తరఫున ప్రచారం చేసే స్టార్ క్యాంపెయినర్లను కూడా చేసేస్తున్నది. అజిత్ పవార్ మొదలుకొని నవీన్ జిందాల్ వరకు గతంలో బీజేపీ చేత అవినీతిపరులుగా ముద్ర వేయించుకున్న నేతలంతా ఇప్పుడు అదే పార్టీతో చేతులు కలిపారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కీలక భూమిక పోషిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం చూస్తున్న రాజకీయ విశ్లేషకులు బీజేపీని వాషింగ్ మెషీన్‌తో పోలుస్తున్నారు. ఎన్ని మరకలున్న దుస్తులైనా ఒకసారి వాషింగ్ మెషీన్‌లో వేస్తే శుభ్రమైనట్టు బీజేపీలో చేరిన నేతలు కూడా మంచి వారు అయిపోతున్నారా అంటూ ప్రశ్నిస్తున్నారు.

**మహారాష్ట్ర బీజేపీ స్టార్ క్యాంపెయినర్‌గా అజిత్**

ఎన్సీపీలో చీలిక తెచ్చి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అయిన అజిత్ పవార్‌ను ఈ ఎన్నికల కోసం స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో బీజేపీ చేర్చింది. గతంలో ఆయనపై బీజేపీ అనేక ఆరోపణలు చేసింది. మహారాష్ట్ర స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్‌లో రూ.25 వేల కోట్ల కుంభకోణం కేసు కూడా ఆయనపై ఉండేది. అయితే, బీజేపీతో జట్టుకట్టిన తర్వాత ఈ కేసులో అజిత్ పవార్‌కు పోలీసు శాఖ క్లీన్‌చిట్ ఇచ్చింది. ఇప్పుడు అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీతో బీజేపీ పొత్తు పెట్టుకుంది. ఇదే ఎన్సీపీని 2014లో ప్రధాని మోదీ.. నేచురల్ కరప్షన్ పార్టీగా నిర్వచించారు.

**మరో స్టార్ క్యాంపెయినర్ 'ఆదర్శ్' అశోక్ చవాన్**

మహారాష్ట్రలోనే ఇటీవల బీజేపీలో చేరిన మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ చవాన్‌ను రాజ్యసభ సభ్యుడిని చేయడంతో పాటు పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా బీజేపీ నియమించింది. ఆదర్శ్ కుంభకోణంలో చవాన్ నిందితుడిగా ఉన్నారు. ఈ కేసును ఈడీ విచారిస్తున్నది. గతంలో అనేకసార్లు చవాన్‌ను బీజేపీ అవినీతిపరుడని విమర్శించింది. 2014లోనైతే చవాన్‌కు టికెట్ ఇచ్చిన కాంగ్రెస్‌కు సిగ్గులేదని మోదీ నిందించారు.

**కండువా కప్పుకోగానే నవీన్ జిందాల్‌కు టికెట్**

ఇటీవల కాంగ్రెస్ మాజీ ఎంపీ, పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్ బీజేపీలో చేరగా, గంటల వ్యవధిలోనే ఆయనకు కురుక్షేత్ర ఎంపీ టికెట్ ఇచ్చారు. జార?ండ్, మధ్యప్రదేశ్‌లో బొగ్గు గనుల కేటాయింపుల్లో అక్రమాల ఆరోపణలు నవీన్‌పై ఉన్నాయి. సీబీఐ, ఈడీ కూడా విచారించింది. ఈ బొగ్గు గనుల కుంభకోణానికి సంబంధించి మోదీ గతంలో అనేక ఆరోపణలు చేశారు. జార?ండ్ గనులు లూటీ కాకుండా చేస్తానని ఆయన ప్రకటించారు.

**గీతా కొడాకు కండువా కప్పేశారు**

బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంలో అవినీతి ఆరోపణలపై జైలు శిక్ష అనుభవించిన జార?ండ్ మాజీ ముఖ్యమంత్రి మధు కోడా భార్య గీతా కోడాను ఇటీవల పార్టీలో చేర్చుకుంది బీజేపీ. ఆమెకు సింఘ్‌భుమ్ లోక్‌సభ టికెట్ ఇచ్చింది. గీతా కోడా 2018లో కాంగ్రెస్‌లో చేరినప్పుడు బీజేపీ నేతలు కాంగ్రెస్‌పై అనేక విమర్శలు చేశారు. అవినీతిని వ్యవస్థీకృతం చేస్తున్నారని, మధు కోడా చేసిన కుంభకోణంలో కాంగ్రెస్ నేతలకూ పాత్ర ఉన్నదని ఆరోపించారు.

**'దొంగ' అన్న నేతకే టికెట్**

పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత తపస్ రాయ్‌ను ఇటీవల బీజేపీలో చేర్చుకుని కోల్‌కతా నార్త్ ఎంపీ టికెట్ ఇచ్చారు. మున్సిపాలిటీ ఉద్యోగ నియామకాల్లో అక్రమాల ఆరోపణలపై ఆయనపై ఈడీ విచారణ జరిపింది. ఆ సమయంలో బెంగాల్ బీజేపీ కీలక నేత సువేంధు అధికారి.. తపస్ రాయ్‌ను 'దొంగ' అని విమర్శించారు.ఇలా చెప్పుకుంటూ పోతే అవినీతి ఆరోపణలు ఉన్న, సీబీఐ, ఈడీ, ఐటీ తదితర దర్యాప్తు సంస్థల విచారణ ఎదుర్కొన్న ఎంతో మంది నేతలను పార్టీలోకి చేర్చుకొని మంచి ప్రాధాన్యం ఇస్తున్నది బీజేపీ.

**మళ్లీ బీజేపీలోకి 'గాలి'**

బీజేపీ నేతగా ఉంటూనే అక్రమ మైనింగ్‌కు పాల్పడిన కేసులో ఇరుక్కొని జైలుకు వెళ్లొచ్చిన కర్ణాటక నేత, ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డిని కొంతకాలం బీజేపీ పక్కనపెట్టింది. ఆయన సోదరులకు మాత్రం టికెట్లు ఇచ్చింది. దీంతో బీజేపీపై కోపంతో గాలి జనార్ధన్‌రెడ్డి సొంత పార్టీ పెట్టుకొని గత అసెంబ్లీ ఎన్నికల్లో బళ్లారి, బాగల్‌కోట్, కొప్పాళ జిల్లాలో బీజేపీకి నష్టం చేశారు. దీంతో ఈ లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి నష్టం జరగకుండా ఆయనను మళ్లీ బీజేపీలో చేర్చుకున్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత

హైదరాబాద్,తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత కొరసాగుతోంది. ఎండలు తీవ్రరూపం దాల్చడంతో జనం బెంబేలెత్తుతున్నారు.ఉదయం 12 గంటలు దాటితే ఎండలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. మరో మూడు రోజులు రికార్డు స్థాయిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు అంటున్నారు. రాగల మూడు రోజులు సాదారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని

# హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన గద్దె



విజయవాడ,:విజయవాడలోని తూర్పు నియోజకవర్గం ఇప్పుడు మరోమారు చర్చగా మారింది. గతంలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పట్టు సాధించింది. ప్రస్తుతం ఆ పార్టీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రెండోసారి ఎమ్మెల్యేగా ఇక్కడ నుంచే కొనసాగుతున్నారు. హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన గద్దెరామ్మోహన్.... మరోసారి విజయవాడ తూర్పు నుంచే తెలుగుదేశం పార్టీ తరపున పోటీలో ఉండగా... .తెలుగుదేశం నుంచి వైసీపీలో చేరిన మాజీమంత్రి దేవినేని నెహ్రూ కుమారుడు దేవినేని అవినాష్ ఈసారి ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ పడుతున్నారు. గతంలో అవినాష్ తండ్రీ ఐదుసార్లు ఇదే ప్రాంతం నుంచి గెలిపొంది ఉండటంతో నియోజకవర్గ వ్యాప్తంగా దేవినేనికి అనుచరులు ఉండటంతో గెలుపై ఆయన దీమాగా ఉండగా.... రెండుసార్లు ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధే తనను గెలిపిస్తుందని గద్దె రామ్మోహన్ చెబుతున్నారు. దీన్ని 1967 నియోజకవర్గాల పునర్విభజన చట్టం ప్రకారం ఏర్పాటు చేశారు. విజయవాడ నగరపాలక సంస్థలోని వార్డులతోపాటు అర్బన్ ప్రాంతం ఈ నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. విజయవాడ తూర్పు నియోజకవర్గం 1967లో ఏర్పాటు చేసినా 2007లో జరిగిన పునర్విభజనలో పేరు మాత్రం అలాగే ఉంచి...నియోజకవర్గ స్వరూపం మొత్తం మార్చేశారు. గతంలో కంకిపాడు నియోజకవర్గం లో ఉన్న ప్రాంతాలన్నింటినీ ఇప్పుడు విజయవాడ తూర్పులో కలిపేశారు. విజయవాడలోని అత్యంత కీలమైన బందర్‌రోడ్డు, ఆటోనగర్, మేజర్ కాలనీలు , హెల్త్ యూనివర్సిటీలు, కీలకమైన కళాశాలు ఉన్నాయి. 1967లో జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున నిల్చున్న తెన్నేటి వి.ఎస్.సి.ఆర్ గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఈ సీటు నిలబెట్టుకుంది. 1972లో జరిగిన ఎన్నికల్లో దమ్మాలపాటి రామారావు గెలుపొందారు. 1978లో కాంగ్రెస్ హ్యాట్రిక్ విజయం సాధించింది. ఆ పార్టీ తరపున పోటీ చేసిన మాజీముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు గెలుపొందారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ గాలి వీచింది. 1983లో జరిగిన ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి అడుసుమిల్లి జయప్రకాశ్‌రావు జయకేతనం ఎగురవేశారు. ఆ తర్వాత విజయవాడలో వరుస హత్యలు, తదనంతర పరిణామాలతో కాంగ్రెస్ పార్టీలో చేరిన వంగవీటి రంగాకు 1985లో విజయవాడ తూర్పు టిక్కెట్ కేటాయించింది. ఆ ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందగా....ప్రత్యర్థుల దాడిలో ఆయన హత్యకు గురయ్యారు. అనంతరం 1989లో జరిగిన ఎన్నికల్లో రంగా భార్య రత్నకుమారికి కాంగ్రెస్ టిక్కెట్ కేటాయించగా...ఆమె విజయం సాధించారు. 1994లో రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం గాలి వీచినా....విజయవాడ తూర్పులో మాత్రం మరోసారి వంగవీటి రత్నకుమారి కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించారు. 1999 ఎన్నికల్లో పొత్తులో భాగంగా ఈ సీటును తెలుగుదేశం పార్టీ బీజేపీకి కేటాయించడంతో ఆ పార్టీ నుంచి సినీనటుడు కోట శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004లో జరిగిన ఎన్నికల్లో వంగవీటి రంగా కుమారుడు రాధాకు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ కేటాయించింది. ఈ ఎన్నికల్లో ఆయన విజయం సాధించి తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. ఇదే నియోజకవర్గం నుంచి ఆయన తండ్రీ, తల్లీ, కుమారుడు ముగ్గురు విజయం సాధించడం విశేషం. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం కంకిపాడు రద్దవ్వడం...ఆ నియోజకవర్గంలోని చాలా ప్రాంత విజయవాడ తూర్పులో కలవడంతో కాంగ్రెస్‌లో చేరిన దేవినేని నెహ్రూ విజయవాడ తూర్పు టిక్కెట్ దక్కించుకున్నారు . తెలుగుదేశం నుంచి గ్దదెరామ్మోహన్ బరిలో దిగగా... ప్రజారాజ్యం నుంచి టిక్కెట్ సాధించిన యలమంచలి రవి కేవలం 190 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి మరోసారి గ్దదె రామ్మోహన్ పోటీ చేసి వైసీపీ అభ్యర్థి వంగవీటి రాధాపై విజయం సాధించారు. 2019 జరిగిన ఎన్నికల్లో రెండోసారి గ్దదెరామ్మోహన్ విజయవాడ తూర్పు నుంచి గెలుపొందారు. వంగవీటి రాధా తెలుగుదేశంలో చేరగా...వైసీపీ టిక్కెట్ బొప్పన భవకుమార్ దక్కించుకున్నారు.

# కెసిఆర్ రాజకీయ అసహనానికి పరాకాష్ట

హైదరాబాద్, మేడిగడ్డ కుంగుబాటు చిన్న విషయమట..పంటలకు నీళ్లు అందకపోవడం ప్రభుత్వ వైఫల్యమట..ప్రభుత్వం చేతగాకపోతే దిగిపోవాలట... నీరు అందించడం లేదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత రంకెలు వేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తన అక్కసును వెళ్లగక్కారు. తాను ఉండివుంటే అని చెప్పకపోయినా..రైతులకు అలాంటి భ్రమలే కల్పించారు. ఇంతకాలం కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ కెటిఆర్, హరీష్ రావులు అంటే..వారి బాటలోనే కెసిఆర్ విమర్శలు చేశారు. ఆయన మాటలు చూస్తుంటే సగటు మనిషికి కూడా ఆగ్రహం తెప్పించేదిగా ఉంది. చేసేదంతా చేసిన కెసిఆర్ ఇప్పుడు నెపాన్ని కాంగ్రెస్ మీదకు నెట్టాలని చూశారు. తన కాలంలో జరిగిన పాపాలకు కనీసంగా స్పందించడం లేదు. అధికారమంటే బాధ్యత అనే విషయం విస్మరించి, తమకు ప్రత్యర్థులే ఉండకూడదన్న ధోరణితో వ్యవహరించిన కెసిఆర్ అడ్డగోలుగా గెలిచిన ఎమ్మెల్యేలను తన మందలో తోలుకున్నారు. తెలంగాణ పునరేకీకరణ అంటూ వక్ర భాష్యాలు చెప్పారు. కలసి పనిచేద్దామని అన్నారు. ఆనాడు ఆయన చెపింది వేదం అయినప్పుడు ఇప్పుడది అర్థం మారుతుందా ..అన్నది ఆయనే చెప్పాలి. ఇప్పుడేమో ఒకరిద్దరు చిల్లరగాళ్లు పోయినంత మాత్రాన నష్టం లేదని బీరాలు పలుకుతున్నారు. నిజానికి పార్లమెంట్‌కు పోటీ చేసేందుకు అభ్యర్థులు దొరకని దురవస్థ కేసీఆర్‌కు దాపురించింది. నిన్నటి వరకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కోసం కాంగ్రెస్,బీజేపీలు వెతుక్కొన్నాయి. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని లాక్కున్నాయి. రాజకీయాల్లో అదీ ఎన్నికల ముందు ఇది సర్వసాధారణం. ఇప్పుడు బీఆర్ఎస్ తరఫున టికెట్ పొందినవారు కూడా మాకొద్దీ టిక్కెట్ అటూ పారిపోతున్నారు. అధికారంలో ఉండగాకేసీఆర్ విర్రవీగిన రోజులు అప్పుడే మరచిపోలేం. అందుకే ఆయనకు ఈ తరహా పతనమే తప్పదని కాలం గట్టిగానే చెప్పింది. అధికారంలో ఉన్నప్పుడు బలమైన నాయకులను పక్కన పెట్టిన కారణంగా ఇప్పుడు అధికారం కోల్పోయాక ఒంటరిగా అఘోరిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంతో మమేకమై పార్టీని నమ్ముకొని ఉన్నవాళ్ల ను కాదని ప్రజాబలం లేని వాళ్లను, తనకు వంత పాడే వాళ్లను కేసీఆర్ తన చుట్టూ భజన బృందందగా చేసుకున్నారు. ఫలితంగా బలమైన నాయకులు దూరమయ్యారు. ప్రజాబలం లేకపోయినా కేసీఆర్ మనసెరిగి వ్యవహరించడం ద్వారా లాభపడుతూ వచ్చిన వాళ్లు ఇప్పుడు ఒక్కొక్కరుగా ఆయనను విడిచి వెళ్లిపోతున్నారు. ఉద్యమకారులను అవమానించిన కెసిఆర్ ఇప్పుడు చిల్లరగాళ్లు అని వ్యాఖ్యానించడం ఆయన ఆక్రోశాన్ని వెల్లగక్కించేలా చేసింది. ఆనాడు అవసరార్థం కెసిఆర్ వద్దకు వచ్చిన వారు..ఇప్పుడు తమ అవసరార్థం మళ్లీ పార్టీ మారుతున్నరు. ఆనాడు



ఎంత అవకాశవాదం ఉందో..ఇవాళ కూడా అంతే అవకాశవాదం వుంది. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన రంజిత్ రెడ్డి, మహేందర్ రెడ్డి తనను పిచ్చోడ్ని చేశారని కేటీఆర్ వాపోయారు. నిజానికి కెసిఆర్ కుటుంబమంతా కలసి ప్రజలను పిచ్చోళ్లను చేశామని వారికి మాత్రమే తెలిసిన విద్య. రాజకీయాల్లో పర్మినెంట్ విధేయత పార్టీ అన్నది ఏనాడో లేకుండా పోయింది. అధికారంలో ఉన్న పార్టీలోనే ఉండడానికి నేతలు ఇష్టపడుతున్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరడానికి బీఆర్ఎస్‌కు చెందిన అనేక మంది పోటీ పడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థులలో రంజిత్ రెడ్డి, కడియం కావ్య కాంగ్రెస్‌లోకి వెళ్లడం బిఆర్ఎస్ పార్టీ దీనావస్తను సూచిస్తోంది. మరికొందరు అదే బాటలో ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలో మమేకమై పార్టీనే నమ్ముకున్న వారిలో ఎవరికి కూడా టికెట్ ఇవ్వకుండా తొలినాళ్లలో అవమానం చేశారు. అధికారం వచ్చాక అలాంటి వారిని దూరం పెట్టారు. అందుకే దానిఫలితం కేసీఆర్ ఇప్పుడు అనుభవిస్తున్నారు. కేసీఆర్ పట్ల ఇప్పుడు ప్రజల నుంచి కనీసం సానుభూతి రావడం లేదు. కేసీఆర్ కుటుంబంపై తెలంగాణ సమాజంలో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. కవితను అరెస్ట్ చేసినా ప్రజల్లో ఎక్కడా సానుభూతి రాలేదు. ఆ కుటుంబ వ్యవహార శైలే ఇందుకు కారణం అని చెప్పిక తప్పదు.. అధికారంలో ఉన్నప్పుడు నిరంకుశంగా వ్యవహరించిన కారణంగానే కెసిఆర్ ప్రజాదరణ కోల్పోయారు. చేసిన తప్పులను తెలుసుకుని ఇప్పుడున్న ప్రభుత్వానికి తగని మంచి సూచనలు చేస్తూ.. తెలంగాణ అభివృద్ధికి ముందుకు వస్తే కేసీఆర్‌ను మళ్లీ ప్రజలు ఆదరించవచ్చు.రాష్ట్రం విడిపోయిన పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కెసిఆర్ అహంకారం ఒక్కటే కారణమని గుర్తించకుండా ఇంకా విమర్శలు చేస్తే ప్రజల్లో ఉన్న ఆదరణ కూడా పోతోంది.

# స్థాయిని దిగజార్చుకున్న కేశినేని...

విజయవాడ, ఎంపీ కేశినేని నాని వైసీపీ లోకి వెళ్లిన తర్వాత మరీ తన స్థాయిని దిగజార్చుకుని మాట్లాడుతున్నారని విజయవాడ పశ్చిమ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. కేశినేని నాని వ్యాఖ్యలపై సుజనా చౌదరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేశినేని నాని స్థాయికి తాను దిగిజారి మాట్లాడలేనని అన్నారు. పదేళ్లు కేశినేని నానితో కలిసి పని చేశానని.. అప్పుడు బాగానే ఉండేవారని.. ఇప్పుడేందుకు ఇలా మాట్లాడుతున్నారో ఆయన్నే అడగాలని అన్నారు. సోమవారం నాడు బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... తాను ధనికుడిగానే పుట్టానని... తాను ధనికుడినినని ఇప్పుడే నానికీ తెలిసిందా అని ఎద్దేవా చేశారు. ధనికులు అయితే ప్రజలకు సేవ చేయరా.. ప్రజల్లో కలవరా అని ప్రశ్నించారు. ఆయన మాట్లాడినట్లు తనకు నీచంగా మాట్లాడటం రాదన్నారు. తాను విజయవాడ వాసినే.. స్థానికేతురుడని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. విజయవాడలో ఉన్న వారంతా ఇక్కడి వారేనా అని ప్రశ్నించారు. కొంతమంది నేతలు చాలా దిగజారి మాట్లాడుతున్నారని.. వారిపై సానుభూతి వ్యక్తం చేయడం తప్ప తానేమీ చేయలేనని అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి రోడ్డూ తనకు తెలుసునని చెప్పారు. ఎన్డీఏ కూటమిలో భాగంగా తనకు ఇక్కడ సీటు ఇచ్చారని చెప్పారు. జనసేన నేత పోతిన మహేష్‌కు టికెట్ రాకపోవడంతో కొంత ఆవేదన ఉండవచ్చని అన్నారు. ఆయనతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాట్లాడారని చెప్పారు. తెలుగుదేశం – బీజేపీ – జనసేన కూటమి రాబోయే ఎన్నికల్లో విజయం కోసం పోతిన మహేష్ కూడా పని చేస్తారని తెలిపారు. కూటమి నేతల మధ్య ఎలాంటి ఇబ్బందులు లేవని అన్నారు. అందరం కలిసి పని చేస్తామని.. విజయం సాధిస్తామన్నారు. తాను దరఖాస్తు చేయకుండానే.. కూటమి తనను ఎంపిక చేసిందని తెలిపారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన కూటమి ముఖ్య నేతలకు ధన్యవాదాలు



తెలిపారు. ఈ ఎన్నికల్లో గెలిచి ప్రజలకు ఎంతో సేవ చేస్తానని.. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చెస్తానని చెప్పారు. రాజకీయాల్లో గాలి ఏ విధంగా ఉంటే ఆ విధంగానే పని చేయాలని... వ్యతిరేక మార్గంలో చేయలేం కదా అని అన్నారు. తనపై నిందలు వేయడమే వైసీపీ నేతలు పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. తన పని తీరేంటో ప్రజలు త్వరలోనే చూస్తారన్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లో తనకు పోటీ చేసే అవకాశం గతంలో కూడా రాలేదని చెప్పారు. ఇప్పుడు విజయవాడ వంటి నగరంలో రావడం తన అదృష్టమని తెలిపారు. ఒక ఎమ్మెల్యే ఎంత మంచి పని చేయొచ్చో చేసి చూపిస్తానని అన్నారు. సేవ చేసి మంచి ఎమ్మెల్యేగా ప్రజల్లో స్థానం సంపాదించుకుంటానని సుజనా చౌదరి చెప్పారు.

# కర్ణాటకలో సీఎం మార్పు?..



మైసూర్/మండ్య, కర్ణాటకలో త్వరలో సీఎం మార్పు జరుగనున్నదా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత లేదా అసెంబ్లీ టర్మ్ మధ్యలోనే నాయకత్వ మార్పు ఉంటుందని రాజకీయ వర్గాల్లో ఇప్పటికే జోరుగా చర్చ జరుగుతున్న వేళ.. తాజాగా సోమవారం వేర్వేరుగా ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్న వీరిద్దరు చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత కూడా ఎలాంటి అడ్డంకులు లేకుండా తానే సీఎంగా కొనసాగాలంటే.. తన వరుణ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థికి భారీ మెజార్టీ ఇవ్వాలని సిద్ధరామయ్య ప్రజలను కోరారు. 'నేను సీఎంగా కొనసాగాలా? వద్దా?.. వరుణలో కాంగ్రెస్ అభ్యర్థికి 60 వేల మెజార్టీ ఇవ్వండి' అంటూ సిద్ధరామయ్య ప్రజలను చేతులెత్తి అభ్యర్థించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో తన సీఎం పదవి భవిష్యత్తును ముడిపెడుతూ మాట్లాడారు. మరోవైపు మండ్యలో జరిగిన ఎన్నికల సభలో పాల్గొన్న డీకే శివకుమార్, గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తనను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్‌కు ఓటేసిన ప్రజల కోరిక.. 'అబద్ధం కాబోదు' అంటూ వ్యాఖ్యానించారు.

చేతులెత్తి అభ్యర్థిస్తున్నా..

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరుణలో నిర్వహించిన సభలో సీఎం సిద్ధరామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుణ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి భారీగా మెజార్టీ ఇవ్వాలని ఓటర్లను కోరారు. '2019 లోక్‌సభ ఎన్నికల్లో ధ్రువనారాయణ్(కాంగ్రెస్ అభ్యర్థి) కేవలం 1,817 ఓట్లతో ఓడిపోయారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో వరుణలో మీరు నాకు 48 వేల ఓట్ల మెజార్టీ ఇచ్చారు. అదేవిధంగా ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో మీరు కాంగ్రెస్ అభ్యర్థికి మన నియోజకవర్గంలో 60 వేల ఓట్ల ఆధిక్యం ఇస్తే, నేను సంతోషిస్తాను. అప్పుడు నన్ను ఎవరూ టచ్ చేయలేరు. నేను సీఎంగా ఉండాలా? వద్దా? చేతులెత్తి అభ్యర్థిస్తున్నా. గెలిచిన తర్వాత మీకు ధన్యవాదాలు చెప్పేందుకు మళ్లీ వస్తా' అని పేర్కొన్నారు. వరుణ అసెంబ్లీ నియోజకవర్గం చామరాజనగర్ లోక్‌సభ స్థానం పరిధిలోకి వస్తుంది. ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రాష్ట్ర మంత్రి మహదేవప్ప కుమారుడు సునీల్ బోస్ పోటీచేస్తున్నారు.

ఆందోళన చెందొద్దు..

మరోవైపు తన కమ్యూనిటీ వొక్కలిగల ప్రభావం అధికంగా ఉండే మండ్య జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం, రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరిన ఆయన.. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనను దృష్టిలో పెట్టుకొని ఓటేసిన మీ కోరిక అబద్ధం కాబోదంటూ ప్రజలకు హామీ ఇచ్చారు. 'నేను మీకు ఒక్కటి చెప్పదలచుకొన్నా.. నన్ను దృష్టిలో ఉంచుకొని, గత అసెంబ్లీ ఎన్నికల్లో మండ్య జిల్లాల్లో కాంగ్రెస్‌కు అధిక సీట్లు ఇచ్చారు. మీ కోరిక అబద్ధం కాబోదు. మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని శివకుమార్ పేర్కొన్నారు.

# శ్రీకాకుళం టిడపిలో కొత్త సమస్య



శ్రీకాకుళం, టీడీపీ విడుదల చేసిన చివరి జిబితాతో చాలా నియోజకవర్గాల్లో అసంతృప్తులు బయటపడుతున్నాయి. కొందరు తిరుగుబాట్లు చేస్తున్నారు. కొందరు పార్టీని వీడుతున్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో కొత్త సమస్య వచ్చి పడింది. ఇప్పటి వరకు ఉన్న గ్రూపుల గోల మరింత ఎక్కువ అయ్యే ప్రమాదం ఉందని శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటి వరకు ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఇద్దరు సీనియర్ నేతలు టికెట్ కోసం పోటీ పడ్డారు. కళా వెంకట్రావు ఒకవైపు, కలిశెట్టిఅప్పలనాయుడు ఇంతకాలం పోటీ పడ్డారు. చివరికి ఇప్పుడు ఆ స్థానం బీజేపీకి వెళ్లిపోయింది. వీళ్లంతా తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇద్దరు నేతలు పూర్తిగా డీలాపడిపోయారు. అయితే అధినాయకత్వం వారికి మరో ఛాన్స్ ఇచ్చింది. ఎచ్చెర్ల టికెట్ ఆశించిన కలిశెట్టి అప్పలనాయుడికి విజయనగరం ఎంపీ స్థానం ఇచ్చింది. చీపురుపల్లి నుంచి కళావెంకట్రావుకు ఛాన్స్ ఇచ్చింది. ఒకే స్థానం కోసం పోటీ పడుతున్న ఇరు వర్గాలకు రెండు వేర్వేరు స్థానాలు ఇచ్చి ఇద్దరూ కలిసి పని చేసేలా ప్లాన్ చేసింది. ఈ ఇద్దరు తూర్పుకాపునేతలు ఎచ్చెర్ల అసెంబ్లీ స్థానం కోసం గత కొంత కాలంగా ఒకే పార్టీలో ప్రత్యర్థులుగా మారారు. ఇప్పుడు ఇద్దరికీ విజయనగరం జిల్లాతో ముడిపడి ఉన్న స్థానాలు కేటాయించడంతో ఒకరి కోసం మరొకరు పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిపురుపల్లిలో బొత్సపై వ్యతిరేకత ఉన్నప్పటికీ అక్కడ ఇంచార్జ్‌గా ఉన్న కళావెంకట్రావు తమ్ముడు దాన్ని అందిపుచ్చుకోలేకపోతున్నాడని భావించి కళా వెంకట్రావును అక్కడకు పంపించారు. వీళ్లు ఒకే ఫ్యామిలీ మెంబర్స్ కావడంతో సమన్వయం కూడా ఉంటుందని అధినాయకత్వం ఆలోచన. చీపురుపల్లి నియోజకవర్గంలో కిమిడి నాగార్జునకి ఇస్తారని అనుకున్నారు. కానీ చివరి నిమిషంలో కళా వెంకట్రావు పేరు రావడంతో స్థానిక నాయకత్వం కొంత వ్యతిరేకంగా ఉంది.ఎచ్చెర్లలో ఉంటున్న అభ్యర్థికి చీపురుపల్లి సీటు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికే నాగార్జునతోపాటు అనుచరులు టీడీపీకి రాజీనామా చేశారు. స్వతంత్రంగా పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఇది కళా వెంకట్రావుకు కాస్త తలనొప్పి వ్యవహారంగా మారింది. విజయనగరం ఎంపిగా కలిశెట్టి అప్పలనాయుడుకి అధినేత చంద్రబాబు అవకాశం కల్పించడంతో ఆయన వర్గీయులు హర్షం వ్యక్తం చేశారు. కిమిడి కళా వెంకట్రావుకు చీపురుపల్లి కేటాయించడంపై ఆయన వర్గీయుల్లో నిరాశ కనిపిస్తోంది. మొదట విజయనగరం పార్లమెంట్ స్థానం కళా పేరునే పరిశీలించింది. అయితే ఆయన సుముఖత వ్యక్తం చేయకపోవడంతో మీసాలగీత, కంది చంద్రశేఖర్, కలిశెట్టి అప్పలనాయుడు పేర్లు ప్రస్తావనకు వచ్చాయి. చివరకు అప్పలనాయుడుని ఖరారు చేశారు. చీపురుపల్లి స్థానానికి కూడా గంటా శ్రీనివాసరావు, కళావెంకట్రావును పరిశీలించారు. చివరకు కళా వెంకటరావుకి కేటాయించారు. అప్పలనాయడు విషయంలో ఎలాంటి వ్యతిరేకత కనిపించకపోయినప్పటికీ కళావెంకట్రావు విషయంలో కనిపిస్తున్న వ్యతిరేకతను అధినాయకత్వం ఎలా సెట్ చేస్తుందో అన్నఆసక్తి కనిపిస్తోంది.

# సిరిసిల్లలోనూ ఫోన్ ట్యాపింగ్..

హైదరాబాద్, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో హైదరాబాద్ కమిషనర్‌ను కలిసి కాంగ్రెస్ సీనియర్ నేత కేకే మహేందర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. బషీర్ బాగ్ ఓల్డ్ సీపీ ఆఫీస్ లో సీపీని కలిసి ఆధారాలు సమర్పించారు. సిరిసిల్లలో వార్ రూం ఏర్పాటు చేసి ఫోన్లు ట్యాప్ చేశారని కేకే మహేందర్ రెడ్డి ఆరోపించారు. సిరిసిల్ల వార్ రూం ఏర్పాటు వెనక కేసీఆర్,కేటీఆర్ హస్తం ఉందన్నారు కేకే మహేందర్ రెడ్డి. తన ఫోన్ తో పాటు.. మిగతా పార్టీనేతల ఫోన్లు ట్యాప్ చేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు కేకే మహేందర్ రెడ్డి.కేకే మహేందర్ రెడ్డి వెంట..మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

# కేశవరావుకు మతిభ్రమించింది..

హైదరాబాద్, ఎంపీ కేశవరావు కు మతి భ్రమించినట్లుందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మిలియన్ మార్చ్‌లో కేశవరావును కొడిగుడ్లతో కొట్టిన ఘటనలను గుర్తు చేసుకోవాలన్నారు. ఇవాళ పాట లేదు మాట లేదని కేశవరావు మాట్లాడుతున్నారని.. ఆయన భాష ఎవరికి అర్థం కాదన్నారు. కేశవరావు బిడ్డ అంటే ఎవరో తెలియదని.. అలాంటి ఆమెకు కేసీఆర్ హైదరాబాద్ మేయర్ పదవి ఇచ్చారన్నారు. పాటకు చరిత్ర లేకపోతే జయ జయహే తెలంగాణ పాటను రాష్ట్ర గీతంగా ఎలా తీసుకున్నారని రసమయి ప్రశ్నించారు. తెలంగాణ సంస్కృతిని అవమానించడం కేకేకు సరికాదన్నారు. కేశవరావు వెంటనే కళాకారులకు క్షమాపణ చెప్పాలని రసమయి డిమాండ్ చేశారు. లేదంటే ఆయన ఇంటి ముందు ధూం ధాం నిర్వహిస్తామన్నారు. ఓట్ల కోసం గద్దర్ అన్నను వాడుకున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదట్నుంచి తెలంగాణ బతుకుల మీద విషం చిమ్ముతూనే ఉందన్నారు. కడియం కావ్యకు బీఆర్ఎస్ పార్టీలో సభ్యత్వం లేదన్నారు. కడియం శ్రీహరి ఏ బడిలో చదువుకున్నారో.. ఎక్కడ బడి చెప్పారో ఎవరికీ తెలియదన్నారు. కడియం శ్రీహరి మాదిగ ద్రోహి అని.. మాదిగ జాతి అంటేనే ఆయనకు కళ్ల మంట అని రసమయి పేర్కొన్నారు. కడియం శ్రీహరి వైఖరి వల్లనే తాడికొండ రాజయ్య, ఆరూరీ రమేష్



వెళ్ళిపోయారని రసమయి అన్నారు. మాదిగలకు ఒక్క సీటు కూడా కాంగ్రెస్ పార్టీ ఇవ్వలేదన్నారు.కాంగ్రెస్ పార్టీ మాదిగలకు సీటు ఇవ్వకపోతే చావు డప్పు కొడుతామన్నారు. వరంగల్‌లో కడియం శ్రీహరిపై చావు డప్పు కొడుతామని హెచ్చరించారు. ముసలి నక్కలన్నీ కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవుతున్నాయని రసమయి అన్నారు. మా పార్టీ ఆదేశిస్తే తాను వరంగల్ నుంచి పోటీ చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీలో మాదిగలకు ఎన్ని సీట్లు ఇచ్చారనే దానిపై మందకృష్ణ మాదిగ అన్న ఎందుకు మాట్లాడం లేదని రసమయి ప్రశ్నించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com